హనీబీ

సంపుటి 4, సంచిక 4

జనవరి - ఫిబ్రవరి 2016

# పల్లెసృజన


గ్రామీణ సృజనా శక్తికి వెలుగుదారుల వేదిక

www.pallesrujana.org






# మూడు కాకుల కథ.... జ్ఞానమా? వివేకమా?



కాకులకి రెక్కలొచ్చే సమయంలో తోటి కాకులు వాటిని కొన్ని ప్రశ్నలడిగి వాటి సమాధానాల ఆధారంగా అవి తమ గుంపులోకి రావటానికి అర్హమైనవి అవునా, కాదా అని నిర్ణయిస్తాయి. ఒకరోజు మూడు కాకిపిల్లలకి పరీక్ష నిర్వహించడానికి కాకి నాయకుడు సిద్ధమయ్యాడు. మొదటి కాకిపిల్లని పిలిచి ప్రపంచంలో అన్నిటికన్నా భయాన్ని కలిగించే సందర్భం ఏమిటో చెప్పమన్నాడు. దానికా పిల్లకాకి 'బాణం' అన్నది. దాన్ని తోటి కాకులూ అంగీకరించాయి. నాయకుడు మరో చెట్టుమీద వేచివున్న రెండో కాకిపిల్ల దగ్గరకెళ్ళి ఇదే ప్రశ్న వేశాడు. దానికది ఒక్క క్షణం ఆలోచించి 'నేర్పుగల విలుకాడు'. ఎందుకంటే బాణంవల్ల మనకు మరణం సభవించినా దానిని వదిలే విలుకాని నేర్పు చాలా ముఖ్యం అంది. దానికి చుట్టూవున్న కాకులు 'అవును అవును' అని సమర్థించాయి. అప్పుడు కాకి నాయకుడు మూడో కాకిపిల్ల వద్దకెళ్ళి మళ్ళీ అదే ప్రశ్న వేశాడు. ఇది కొంచెంసేపు ఆలోచించి 'నాకు నైపుణ్యం లేని విలుకాడంటే భయం' అన్నది. దానికి మిగతా కాకులు నిర్ఘాంతపోగా, కాకి నాయకుడు 'ఎందుకలా అన్నావు' అని అడిగాడు. దానికా పిల్లకాకి 'నేర్పుగల విలుకాడు సరిగ్గా బాణం వదులుతాడు. కాస్త ఎడమకో, కుడికో జరగితే తప్పించుకోవచ్చు. కానీ, నేర్పులేని విలుకాని బాణం ఎటువైపునుంచి వస్తుందో మనం ఊహించలేం, మనకు తెలియదు కదా' అన్నది. అన్ని కాకులు ఏక కంఠంతో దాన్ని మెచ్చుకున్నాయి. నాయకుడు మిస్పృహతో వెనక్కి తిరిగాడు. ఆయనకి తెలిసిపోయింది – తన నాయకత్వపు రోజులు దగ్గరపడ్డాయని. కొత్తగా రెక్కలొచ్చిన కాకుల వివేకాన్ని తతిమా కాకులు గ్రహించాయని ఆయనకు తెలిసిపోయింది.

జ్ఞానం కన్నా వివేకం గొప్పది. మనం గ్రాస్‌రూట్స్ స్థాయి వ్యక్తుల వివేకాన్ని ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నాము? ఈ విషయంపై మీ అభిప్రాయాలు తెలపండి.

– హనీబీ 10(1)) – 1999.

# పల్లెసృజన

సంపుటి-4 సంచిక - 4

జనవరి - ఫిబ్రవరి 2016

## ఈ సంచికలో...


- యువ రైతు సూర్య – సౌందర్య లేపన - 3
- బంజారా భాషకు లిపి వచ్చేసింది - 5
- కూలీల ఖర్చు తగ్గించే పురుగుమందు పిచికారి - 8
- 17వ చిన్నశోధయాత్ర – జ్ఞానయాత్ర - 10
- ఒక భారతీయ సగటు రైతు కథ – ధారావాహికం - 14
- 8వ ద్వైవార్షిక పోటీలు (ధారావాహికం) - 18
- పశ్చిమ గోదావరి జిల్లా సాంప్రదాయ జ్ఞానం - 26
- వెలుగుతున్న జీవితాలు – విఫణి వీధిలో అడుగు పెట్టిన పల్లెజ్ఞానం – చంద్రశేఖర్ శ్రీశైలం - 27
- అమేజింగ్ ఇండియన్ – ప్రధాన మంత్రి గౌరవించిన చింతకింది మల్లేశం - 29
- 'పల్లెసృజన' ప్రగతి - 31
- స్పందన - 32


కవర్ లోపలి పేజీల్లో ....

హనీబీ కథ, అమ్మకానికి సిద్ధంగా వున్న ఇన్నోవేషన్లు

మధ్య పేజీ :

గుంటూరు ల్యామ్ – అగ్రి ఎక్స్‌పో

ప్రతి పేజీలో అబ్దుల్ కలాం గారి సూక్తులు


### సంపాదకవర్గం

ప్రధాన సంపాదకులు :
బ్రిగేడియర్
పోగుల గణేశం (రిటైర్డ్)

సంపాదకులు :
జమ్మలమడక శశిమోహన్

ఉప సంపాదకులు :
పల్లె వీర రాఘవ రెడ్డి

సలహాదారులు :
డా. కె.ఎల్. రావు
ప్రొ. అనిల్ గుప్త
డా. గీర్వాణి
శ్రీ పి. చంద్రకాంత్ శర్మ
జాగర్లమూడి దుర్గాప్రసాద్
శ్రీమతి అరుణ గణేశం
శ్రీ జమ్మలమడక శ్రీకర్

కార్టూన్లు :
వెంకట్



ఎడిటోరియల్ అడ్రస్ :
పల్లెసృజన, 102,
వాయుపురి,
సైనిక్‌పురి పోస్ట్,
సికింద్రాబాద్.
పిన్– 500 094.
ఫోన్ :
040–27111959
98660 01678

E-mail :
editor@pallesrujana.org
www.pallesrujana.org

డి.టి.పి. & డిజైనింగ్ :
నరేంద్ర గ్రాఫిక్స్, హైదరాబాద్.
040– 40029002
81257 99904
E-mail :
narendragrafixhyd@gmail.com


## HoneyBee Regional Collaborators & Publications


**Honey Bee C/o Prof. Anil Gupta**
Indian Institute of Management
Vastrapur, Ahmedabad - 380 015.
Gujarat, India. Ph.: 91-79-26324927, Fax : 91-79-26307341
E-mail : honeybee@sristi.org. http://www.sristi.org

**Aama Akha Pakha (Oriya)**
**Dr. Balaram Sahu,**
3R BP 5/2, BP Colony, Unit-8,
Bhubaneswar-751 012.Orissa.
E-mail : balaram_sahu@hotmail.com

**Hittalagida (Kannada)**
**Dr. T.N. Prakash**
Department of Agricultural Economics,
University of Agricultural Economics,
GKVK, Bangalore-560 065.
E-mail : prakashtnk@yahoo.com

**Num Vali Velanmai (Tamil)**
**P. Vivekanandan,**
SEVA, 45, T.P.M.Nagar,
Virattipathu, Madurai - 625 010.
Tamil Nadu, India.
Phone: 0452 - 238 09 43(O), 0452- 238 36 19 ®
e-mail: vivekseva@gmail.com

**Loksarvani (Gujarati) and**
**Sujh-Bujh Aas Paas ki (Hindi)**
SRISTI, P.O. Box No. 1550.
Ambawadi, Ahmedabad - 380 015.
E-mail : loksarvani@sristi.org
sujhbujh@sristi.org

**Ini Karshakan Samsarikkatte**
**(Malayalam)**
**James T J,**
Peemade Development Society,
Peermade, Idukki-685 531, Kerala.
E-mail : pedes@md2.vsnl.net.in


Printed & Published by **Brig. Pogula Ganesham,** Owner and Printed at **M/s Narendra Graphics,** 1-5-1055/2/14, Flat No. 102, B. Block, Silver Springs Residency, Saibaba Nagar, Old Alwal, Secunderabad - 500 010. Ph.: 81257 99904 and Published at 102, Vayupuri, Sainikpuri Post, Secunderabad-500 094, A.P. Ph.: 040-27118555, Mobile : 098660 01678. Editor Sri J. Sesimohan.

# పంట నష్టాలు -రైతుల అప్పులు

కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన '70వ నేషనల్ సాంపిల్ సర్వే'లో ముఖ్యంగా పంట నష్టాలను గురించిన వివరాలు సేకరించారు. ఈ వివరాలు కేంద్ర ప్రభుత్వం ప్రజలకొరకు విడుదల చేశారు. వీటి ప్రకారం 2013-14 వ సంవత్సరంలో 5 రాష్ట్రాల్లో (ఆంధ్రప్రదేశ్, రాజస్థాన్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్) పంట నష్టం 3.4 లక్షల హెక్టార్లలో జరిగింది. నష్టం విలువ 500 కోట్లుగా అంచనా వేశారు. ఆ తరవాతి సంవత్సరం 2014-15లో ఆరు రాష్ట్రాలలో (ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, రాజస్థాన్, పంజాబ్, ఉత్తర ప్రదేశ్) 55 లక్షల హెక్టార్లలో పంట నష్టం కాగా దాని విలువ 500 కోట్లుగా నిర్ణయించారు. 2015లో 15 రాష్ట్రాలలో 182 లక్షల హెక్టార్లలో పంట నష్టం అయినట్టు అంచనా వేశారు. దీని నష్టం 20,453 కోట్లుగా నిర్ణయించారు. వర్షపాతం ఎలా వున్నా, రైతుల నష్టాలు ప్రతి సంవత్సరం ద్విగుణీకృతమవుతునే వున్నాయి. వీటి ప్రభావం రైతు కుటుంబాలపై విపరీతంగా వుంటుంది. కోట్లాది మంది రైతులు పంటలకై చేసిన అప్పులు తీర్చలేక, వాటి భారం మోయలేక, అవమానాలు సహించలేక, నిస్పృహతో, నిస్సహాయంగా జీలితం కొన సాగిస్తున్నారు. ఢిల్లీకి చెందిన 'సెంటర్ ఫర్ సైన్స్ & ఎన్విరాన్‌మెంట్' (సిఎస్ఇ) అనే ఒక ప్రభుత్వేతర సంస్థ జరిపిన సర్వే ప్రకారం తెలంగాణలో 89 శాతం, ఆంధ్రప్రదేశ్‌లో 93 శాతం రైతులు అప్పుల భారలో మునిగి వున్నారు. పంట నష్టాలు పైవిధంగా పెరుగుతూ వుంటే, రైతులు అప్పుల భారంలో మునిగి ఉండక తప్పడం లేదు. ఈ గణాంకాలు ప్రస్తుతం మన సమాజంలో వున్న విపరీత పరిస్థితిని మనకు తెలియజేస్తున్నాయి.

అన్నదాతలైన రైతులు ఇలా అప్పుల భారంలో మునిగి, పంటలు పండించలేక, జీవితంలో అభివృద్ధిని, ఆనందాన్ని సాధించలేక మానసికంగా ఎంత కృశించి పోతున్నారో అంచనా వేయడం కష్టం. మనందరి మనసులను కలపరిచే ఈ స్థితిని అత్యవసర పరిస్థితిగా (ఎమర్జెన్సీ) గుర్తించాలి.

ఇలాంటి జాతీయ సమస్యను కూలంకషంగా ప్రభుత్వం సమాజ సహకారంతో చర్చించాలి. పెరుగుతున్న పంట నష్టాలకు కారణాలు ఏమిటి? కారకులు ఎవరు? వాతావ రణ మార్పుల వల్ల వర్షాభావాలు, పట నష్టాలు జరుగుతున్నాయా? అదుపులేని పారిశ్రామికీకరణ, అయోమయ ఆర్థిక వ్యవస్థ, స్వల్పకాలిక ఆలోచనా పద్ధతి, పెరుగుతున్న  దురాశాభరిత జీవిత విధానాలు.... ఇవన్నీ రైతుల పంట నష్టాలకు, పెరుగుతున్న వారి రుణాలకు కారణాలు కావా? రైతులను ఈ చర్చల్లో కలుపుకుని వారిని సంప్రదించి, పంటల నష్టాలను తీర్చే ఉపాయాలు వెతకాలి. వాతావరణ వైపరీత్యాలు, మానవ జీవన విధానాలు రైతుల నష్టాలకు కారణాలైతే, వాటిని నివారించటానికి ప్రభుత్వాలు, ప్రజలు అన్ని రంగాలలో నిర్దిష్టమైన పద్ధతులు నిర్వచించాలి. వచ్చే 5 సంవత్సరాలలో పంట నష్టాలను అరికట్టే ఒక ప్రణాళికను రూపొందించాలి. స్త్రీలను, యువకులను ఈ చర్చల్లో భాగస్వాములుగా చేయాలి.

రైతులు మానసికంగా శాంతి కోల్పోతే, సమాజంలో అభివృద్ధి వుండదు. సుస్థిరత రాదు, ఆనందం కనిపించదు, దేశం అల్లకల్లోలమవుతుంది. చట్ట విరుద్ధ కార్యక్రమాలు పెరుగుతాయి. పంటలు తగ్గిపోతాయి. ఆహార భద్రతకు భంగం కలుగుతుంది. ఈ సంవత్సరం తెలంగాణలో మామూలుగా వ్యవసాయం చేసే భూమిలో సగంకంటే తక్కువ ప్రాంతంలోనే రైతులు పంటలు పండించారు. వర్షాభావం ఒక కారణమైతే, పారిశ్రామికవేత్తలు, ప్రభుత్వ అధికారులు రైతులకు సరియైన సమాచారం, మార్గదర్శకత్వం చేయకపోవడం వల్ల రైతులకు ఖర్చు తప్పలేదు. పంట రాలేదు. అప్పులు పెరిగాయి.  పశువుకు మేత లేదు, నీళ్ళ కరువు పెరిగింది. రాబోయే సంవత్సరానికి పెట్టుబడులు ఎవరిస్తారు? మరింత అప్పు చేయాలంటే రైతుకు స్థోమత ఉందా? వారిని ఎలా ఆదుకోవాలి? ఇలాంటి భవిష్యత్తులో రానున్న సమస్యలకు పరిష్కారాలు ఇప్పటినుండే వెతకాలి. ముందుగా వ్యవసాయాన్ని సాగించే పరిస్థతిని కల్పించాలి. ఇవన్నీ సాధ్యమనే మేము నమ్ముతున్నాం. చిత్తశుద్ధి, రైతులపైన కరుణ, "వారు లేకపోతే మేము బ్రతకలేము" అన్న దృఢ నమ్మకం ఈ సమస్యలకు పరిష్కారాలు వెతకడానికి తోడ్పడతాయి.

ఈ విషయంపై చర్చ కొనసాగించడానికై పాఠకులు తమ అభిప్రాయాలను పంపుతారని ఆశిస్తున్నాం. 'పల్లెసృజన' రైతుల అభిప్రాయాలను, రైతుల కోసం వ్రాసే అభిప్రాయాలను ప్రచురించడానికి ఎప్పుడూ సిద్ధంగా ఉంటుంది. రానున్న ఎండాకాలంలో రైతులు, పశువులు, చెట్లు, చేమలు ఆరోగ్యంగా ఉండాలని ఆశిస్తూ......



**భవదీయ**

బ్రిగేడియర్ (రిటైర్డ్) పోగుల గణేశం

**కష్టాలు నిన్నుసాధించటానికి రాలేదు.... నీ శక్తి సామర్థ్యాలను బయటకు  తీసి నిన్ను నీవునిరూపించుకునేందుకే వచ్చాయి...**




ముఖంపై అన్ని మచ్చలను రూపుమాపి, అందాన్ని పెంచే
యువ రైతు 'సూర్య' మరో వైద్యం

# సౌందర్య లేపనం

సాంప్రదాయ వైద్యం అందించిన కర్నూలు జిల్లా,, సంజామల మండలం (బనగానిపల్లె తాలూకా), ముదిగేడు గ్రామానికి చెందిన సూర్య 'పల్లెసృజన' పాఠకులకు పరిచయమే. గతంలో మధుమేహ వ్యాధి నియంత్రణకు ఆయుర్వేద ఔషధాన్ని అందించిన సూర్య తన మేధస్సుతో మరో అద్భుతమైన వైద్యాన్ని సమాజానికి అందించాడు.

ఇటీవలి వర్షాల లేమి కారణంగా వ్యవసాయ పనులు అంతగా లేకపోవటంతో తనకు తెలిసిన సాంప్రదాయ వైద్యంపై దృష్టి సారించాడు సూర్య. ఈ క్రమంలో వారి గ్రామస్థుడైన సుబ్బరాయుడు అనే వ్యక్తి వృత్తిరీత్యా వ్యవసాయ దారుడైనా, అతని ప్రవృత్తి కర్నూలు లోని విజయ పాలడైరీకి తన గ్రామంలోని రైతుల నుండి పాలు సేకరించి పంపే చిరు ఉద్యోగం. ప్రతిరోజు ఉదయం, సాయంకాలం గ్రామంలోని రైతులు తెచ్చి ఇచ్చే పాల నుండి దాదాపు 100 మి.లీ. పాలను ప్రత్యేకంగా ఒక సీసాలో సేకరించాలి. ఆ తర్వాతనే ఆ రైతు ఎన్ని లీటర్ల పాలను ఇచ్చాడో కొలిచి అతని గుర్తింపు కార్డులో వ్రాస్తాడు. అలా అందరు రైతుల నుండి పాల సేకరణ అయిపోయిన తర్వాత, ప్రత్యేకంగా సేకరించిన ఒక్కొక్కరి పాలలోని వెన్న శాతాన్ని కనుగొనేందుకు ఓ ప్రత్యేకమైన పరికరంలో ఆ పాలను ఉంచి కొంత ప్రక్రియ చేయవలసి వుంటుంది. ఇందులో భాగంగా ఆ పాలలో ఒక చుక్క ఘాటైన ఆమ్లం (యాసిడ్) వేయాల్సి వుంటుంది. అలాంటి యాసిడ్ సీసా మూతను తీసే క్రమంలో ప్రమాద వశాత్తు ఆ సీసా పగిలి యాసిడ్ చుక్కలు సుబ్బరాయుడి ముఖంపై పడ్డాయి. అవి పుండుగా మారి ఆ తర్వాత అవి మానిపోవటం కూడా జరిగింది. కానీ, ముఖంపై నల్లని మచ్చలు బాగా ఏర్పడ్డాయి.

ఎంతమంది వైద్యులకు చూపించినా అవి మానటం కష్టమని, వాటిని నివారించాలంటే ముఖానికి 'ప్లాస్టిక్ సర్జరీ' తప్ప వేరే మార్గం లేదన్నారు. కానీ ప్లాస్టిక్ సర్జరీ చేయించుకునేంత ఆర్థిక స్థోమత కానీ, తద్వారా తన ముఖాన్ని తీర్చి దిద్దుకోవాల్సిన అవసరం కానీ సుబ్బరాయుని కి కనిపించకపోవటంతో ముఖంపై నున్న మచ్చలు కనపడ కుండా ముఖానికి ఒక రుమాలును అడ్డంగా పెట్టుకుని గ్రామంలో తిరుగుతుండేవాడు.

సూర్య తన గ్రామీణుడు ఉచితంగా వైద్యం చేస్తానన్నపుడు ఒకసారి ప్రయత్నిద్దామని దాన్ని వాడటం మొదలు పెట్టాడు. ఒక వారం తర్వాత చూస్తే రోజు రోజుకూ తన మచ్చలు తగ్గుముఖం పట్టడం సుబ్బరాయుడికే ఆశ్చర్యం వేసింది. పైగా 'ఎంటీ మచ్చలన్నీ తగ్గి అందంగా తయారౌ తున్నావు' అని ఎదురైన గ్రామస్తులు అనటం అతనికి ఎంతో ఆనందం కల్పించింది. తనకు ఇంతటి అందం సమకూరేలా చేసిన సూర్యకు ధన్యవాదాలు తెలియజేశాడు. సుబ్బరాయుడు ముఖంపై మచ్చలను తన ఔషధం మటుమాయం చేయటంతో సూర్య ఆ విషయాన్ని 'పల్లెసృజన'తో పంచుకున్నాడు. తన ఔషధాన్ని వాడిన సుబ్బారాయుడుతో ఫోన్‌లో మాట్లాడించడం జరిగింది.

సుబ్బరాయుడు 'పల్లెసృజన'తో మాట్లాడుతూ.... "నేను ఎన్నో మందులు వాడి, ఎంతోమంది డాక్టర్లను సంప్రదించినా నా ముఖంపై మచ్చలు తగ్గలేదు. ఎన్నో వేల రూపాయలు ఖర్చు చేశాను, ఎన్నో రకాల క్రీములను వాడి చూశాను. ఎటువంటి ప్రయోజనము లేకపోయింది. మా గ్రామస్థుడైన కుర్రాడు సూర్య నన్ను కలిసి "అన్నా నేనో మందు తయారు చేశాను వాడి చూడు, నీ ముఖంపై మచ్చలు తప్పకుండా పోతాయి, దీనివల్ల నీకు ఉంటే లాభం ఉంటుంది కానీ, ఎటువంటి నష్టం జరిగే సమస్యే లేదు, దానికి నేను పూచీ" అన్నాడు. కుర్రాడు మంచివాడే కావటం వల్ల ఓసారి వాడి చూద్దాం అని 'సరే' అన్నాను. మొదట్లో అంతగా శ్రద్ధ

**వర్షం వచ్చినపుడు పక్షులన్నీ నీడను వెతుక్కుంటాయి కానీ గద్దలు వర్షానికి తడవకుండా మేఘాల పైనుంచి ప్రయాణిస్తాయి.**



చూపక పోయినా రాను రాను ఈ క్రీమ్ పూసుకుంటుంటే నా ముఖంలో జరుగుతున్న మార్పులను చూసి, దాన్ని క్రమం తప్పకుండా 45 రోజుల పాటు ముఖానికి పూసుకోవటం జరిగింది. సూర్య మాటలను పెద్దగా పట్టించుకోక పోవటం వల్ల నాకు మచ్చలున్నప్పుడు సూర్య చెప్పినట్లుగా నేను ఫొటో తీయించుకోలేక పోయాను. ఇప్పుడు మచ్చలు పూర్తిగా నయమైన తర్వాత తీయించుకున్న ఫొటో ఇస్తున్నాను (ఇక్కడ ప్రచురించినది). సూర్య అందించిన క్రీమ్ వాడితే తప్పకుండా ముఖంపైనున్న మచ్చలు నయం అవుతాయి. ఇందుకు నేనే ప్రత్యక్ష సాక్ష్యం నా ఫోన్ నెంబరు 98660 99430, అవసరమున్నవారు తప్పక సంప్రదించవచ్చు" అంటున్నాడు.

ఈ ఔషధం గురించి సూర్య మాట్లాడుతూ "ఇది ప్రధానంగా మంచిగంధం లో కొన్ని వనమూలికలను తలిపి తయారు చేశాను. ఇది చాలా సున్నితంగా వుంటుంది. ముఖంపై పూసుకునేటప్పుడు చాలా సుకుమారంగా వుంటుందని, ముఖంపై ఎలాంటి మచ్చలు, మొటిమలు, గాయాల మచ్చలు లాంటివి వున్న వ్యక్తులు ఈ ఔషధాన్ని ముఖానికి పట్టించుకుని, ఒక గంట గడిచిన తర్వాత స్నానం చేయాలి. ఇలా 45 రోజుల పాటు ముఖనికి పట్టిస్తే చాలు ముఖంపైనున్న ఎలాంటి మచ్చలైనా మటుమాయం కావటం తో పాటు ముఖం కూడా అందంగా తయారౌతుంది. రాత్రి ముఖానికి ఈ క్రీమును పట్టించుకుని, ఉదయమే స్నానం చేస్తే ఇంకా బాగా పనిచేస్తుంది. కొందరు వ్యక్తులకు మరీ ముఖ్యంగా స్త్రీలకు కళ్ళకింద ఏర్పడే నల్లని చారలను ఇది అద్భుతంగా రూపుమాపుతుంది. దీన్ని ఇప్పటికే నాలుగైదు మందిపై ప్రయోగాత్మకంగా పరిశీలించడం జరిగింది. దీన్ని వాడిన అందరూ అద్భుతంగా పని చేస్తోంది అన్న తర్వాతనే అమ్మకానికి సిద్ధం చేయటం జరిగింది" అన్నాడు.

ఇదే లేపనాన్ని వాడిన మరో విద్యార్థి నంద్యాలకు చెందిన శ్రీనివాస్ (ఫోన్ నెం. 7396278318), వయస్సు 22 సంవత్సరాలు. ఇతనికి ముఖమంతా మొటిమలు వచ్చి అవి నల్లని మచ్చలుగా మారి అతని ముఖం అందవికారంగా తయారైంది. సూర్య తయారు చేసిన మందును గురించి తెలుసుకున్న శ్రీనివాస్ ఈ క్రీమును తెప్పించుకుని 30 రోజుల పాటు క్రమం తప్పకుండా వాడటం జరిగింది. అంత వరకు మార్కెట్‌లో లభించే ఎన్ని రకాల క్రీములను వాడినా కనిపించని ఫలితం ఈ క్రీము వల్ల లభించటంతో అతని ఆనందానికి అవధులు లేకుండా పోయింది.

అంద వికారంగా వున్న అతని ముఖం ఇప్పుడు ఎలాంటి మచ్చలు లేకుండా మునుపటిలా తయారు కావటంతో అతన్ని చూసిన మిత్రులందరూ ఆ మందును తమకు కూడా తెప్పించమన్నారు. సూర్యతో మాట్లాడి తన మిత్రులందరికీ ఈ మందును సరఫరా చేయటం జరిగింది. వారు కూడా దీన్ని క్రమం తప్పకుండా వాడుతున్నారు అన్నాడు శ్రీనివాస్.

సూర్య అందిస్తున్న ఈ ఔషధం 'పల్లెసృజన' కార్యాలయంలో అందుబాటులో ఉంది. అవసరమున్న వ్యక్తులు ఇన్నోవేటర్ సూర్య ద్వారా కాని, పల్లెసృజన కార్యాలయాన్ని కాని సంప్రదించి తెప్పించుకుని, తమ ముఖాలపై మచ్చలను రూపు మాపుకోవటంతో పాటు, ముఖారవిందాన్ని కూడా పెంచుకో గలరు.

ప్రజలు ముఖ్యంగా యుక్త వయసులో వున్న వారు, అందులో ముఖ్యంగా ఆడపిల్లలు తమ ముఖాన్ని అందంగా చేసుకోవటం కోసం అనేక రకాల క్రీములు/ లేపనాలు/ డాక్టరు సలహాలు పాటిస్తూ వుంటారు. ఈ ప్రక్రియలో టీవీలలో పేపర్లలో వచ్చే ప్రకటనలు ఆజ్యం పోస్తూ వుంటాయి. వీటన్నిటికన్నా సులభంగా, చవకగా, నమ్మకంగా దొరికే ప్రకృతిసిద్ధమైన ఇటువంటి ఔషధం వాడటం క్షేమం కదా.

**ఇన్నోవేటర్ 'సూర్య' ఫోన్ : 99124 85620**

**'క్రియేటివ్ మైండ్స్' సుభాష్ ఫోన్ : 96528 01700**

**నేను గెలవాలి అని గట్టిగా నిర్ధారించుకుంటే ఎప్పటికీ ఓడిపోను.**

# బంజారా భాషకు 'లిపి' వచ్చేసింది

## 50 అక్షరాలతో 'అక్షరమాల' తయారు చేసిన వరంగల్ జిల్లావాసి రమేష్‌నాథ్



సృజనాత్మకత మనిషికి ఎలా, ఏ రూపంలోనైనా వస్తుంది అనటానికి నిదర్శనం 'మాద రమేష్‌నాథ్'. వరంగల్ జిల్లా, కురవి మండలం లోని 'మోదుగుల గూడెం' గ్రామానికి చెందిన యాదగిరి కుమారుడైన 40 సంవత్సరాల రమేష్‌నాథ్ చరిత్రలో తనకంటూ ఓ పేజీని సృష్టించుకోబోతున్నాడు. ఇంతవరకు మట్లాడటమే తప్ప లిపిలేని భాషల్లో ఒకటైన 'లంబాడి' భాషకు "లిపి" తయారు చేయటం ఎంతో ప్రశంసనీయం. తాను పద్మశాలి తెగకు చెందనవాడైనా, లంబాడి భాషకు లిపిని కనిపెట్టడం ఇంకా విచిత్రం అనిపిస్తుంది. దీనికి అంకురం ఎలా ఏర్పడిందో అతని మాటల్లోనే.....

"ఒకరోజు నాకొక కల వచ్చింది. శివాలయం నుండి ఒక బ్రహ్మణుడు నా ముందుకొచ్చి ఓ కాగితం నా చేతిలో పెట్టి వెళ్ళిపోతున్నాడు. దాన్ని తెరిచి చూస్తే పిచ్చి పిచ్చి అక్షరాలు వ్రాసి వున్నాయి. నాకేమాత్రం అర్థం కాలేదు. ఆ కాగితాన్న వుండచుట్ట ప్రక్కన విసిరివేశాను. ఇది గమనించిన బ్రాహ్మణుడు నావైపు మరల తిరిగి వచ్చి దాన్ని పడవేయకు , చింపివేయకు నాయనా, వాటిని అర్థం చేసుకో, బాగా ఆలోచించు, ఈ అక్షరాలు భవిష్యత్‌లో చరిత్రకు సంబంధించినవి అని చెప్పి గుళ్లోకి వెళ్ళిపోయాడు". ఇంతలో మెళకువ వచ్చింది. ఇది కల అని అర్థమైపోయింది. దాన్ని మరల పట్టించుకోలేదు. అలాగని పూర్తిగా మరచిపోనూ లేదు. కొద్ది రోజుల తర్వాత ఖాళీగా వున్నపుడు 100 రూపాయల నోటును అటు ఇటుగా తిప్పుడూ దానిపై ముద్రించబడిన 15 భాషలను పరిశీలించడం మొదలు పెట్టాడు మరేష్‌నాథ్. అలా.... అలా... అతని చూపు వివిధ భాషలపైన, వాటి లిపిలపైన మనసు నిలుపుతూ అన్వేషణ మొదలు పెట్టాడు.

రమేష్‌ది ఒక చిన్న కిరాణా షాపు. రోజుకు వెయ్యి రూపాయల వ్యాపారం నడుస్తూ వుంటుంది. భార్య టైలరింగ్ పనులు చేస్తుంటుంది. ఈ రెంటిపైన వచ్చే ఆదాయంలో తను హాయిగా సంసార జీవితం వెళ్ళదీస్తున్నాడు. కానీ ఏపని చేస్తున్నా అతని దృష్టి అంతా సాహిత్యం మీదకే వెళ్ళేది. ఆ పిచ్చిని ఏమాత్రం చంపుకోలేక పోయేవాడు. ఏదోవొకటి రాస్తూ ఏదైనా సాధించాలి అన్న యోచన. ఏమి సాధించాలో తెలియక మధనపడుతూ వుండేవాడు.


**మనిషికి జీవితంలో కష్టాలు కూడా ఉండాలి. ఎందుకంటే ఆ సమయంలోనే సుఖాలను గురించి ఆలోచిస్తాడు.**

అతని కిరాణా షాపుకు లంబాడి జాతివాళ్ళు ఎక్కువగా వచ్చేవారు. అతని ఇంటికి దగ్గరలోనే 'తాండా' ఉండేది, సమీపంలోని ఇతర తాండాల వాసులు కూడా ఇతని షాపు వద్దకే వచ్చి కిరణాం తీసుకు వెళుతుండేవారు. అలా వచ్చినపుడు వారియొక్క యాసను, భాషను కమనిస్తూ వుండేవాడు. అలా అలా కొన్ని పదాలను..... భాషను అర్థం చేసుకున్నాడు. అలా బాగా అర్థం చేసుకోవటం, మాట్లాడటం చేసిన తర్వాత అతనికి ఈ 'లంబాడ' భాషకు లిపి లేదు కదా వీరు ఈ భాషను మాట్లాడటమే కాని, వ్రాయటం సాధ్యం కాదు కదా అనే ఆలోచన మొదలైంది. అలా ఆలోచిస్తూ... వీళ్ళ భాషకు లిపి వుంటే బావుంటుంది. కొత్తగా వీరికి 'లంబాడ లిపి' తయారు చేద్దాం అనే ఆలోచన మొదలైంది. కాని లోలోపల దీన్ని సాధించ గలనా అన్న అనుమానం కూడా వుండేది. అంధుల కోసం 'బ్రెయిలీ లిపి' కనిపెట్టిన బ్రెయిలీ స్ఫూర్తితో, ఆ తర్వాత ప్రపంచ భాషలన్నింటిని ఒకే లిపితో వ్రాయవచ్చునని ప్రొఫెసర్ శ్రీనివాస చక్రవర్తి ఒక కొత్త లిపి సృష్టించార పరిజ్ఞానంతో 'లిపి లేని భాషకు లిపిని సృష్టించడం కష్టతరమైన పని' అని తెలిసినా, ఎలాగైనా సాధించాలని 'సంకల్పించుకున్నాడు' రమేష్‌నాథ్.


పట్టుదలతో రెండు సంవత్సరాలు కష్టపడి మొత్తానికి 50 అక్షరాలతో 'లంబాడ భాషకు లిపి'ని తయారు చేశాడు. కేవలం ఇంటర్‌మీడియట్ వరకే చదివిన రమేశ్ ఈ అద్భుతాన్ని సృష్టించడం ఎంతో అభినందనీయం. ఎన్నో భాషలను పరిశీలించడం, ఎన్నో రాత్రులు నిద్రలేకుండా గడటపం, అదేపనిగా దానిమీద దృష్టి సారించడం.... ఆరోగ్యపరంగా, డబ్బుల పరంగా కూడా సమస్యలున్నా ఇబ్బందులు పడుతూ ఎన్నో కష్ట నష్టాలను ఎదుర్కొన్నాడు. తనకున్న పేదరికాన్ని పక్కనపెట్టి, దాన్ని పూర్తి చెయ్యాలి అన్న దృఢ సంకల్పంతో ఈ లిపిని సృష్టించడం జరిగింది. దీనికి ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరించిన ప్రతి ఒక్కరికి తన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాడు రమేష్‌నాథ్.

లంబాడ భాష లిపి అయితే తయారు చేశాడు కానీ, దాన్ని సమాజానికి ఎలా అందించాలో అర్థం కాక దాదాపు 6 నెలలు వేచి వుండవలసి వచ్చింది. అనుకోకుండా ఒకరోజు'ఈనాడు' ఆదివారం అనుబంధం పత్రికలో "పల్లెసృజన" గురించిన వ్యాసం చదవటంతో నాలాంటి వారికి నిష్కల్మషంగా, సహృదయంతో తోడ్పాటును అందించే వేదిక 'పల్లెసృజన' అని అర్థమైంది. వెంటనే 'పల్లెసృజన'కు

## అచ్చులు




## హల్లులు




సూర్యుడిలా వెలగాలి అనుకుంటే ముందు సూర్యుడిలా కాలడం నేర్చుకో.

ఉత్తరం వ్రాశాడు. 'పల్లెసృజన' ఆ లిపిని ఎన్.ఐ.ఎఫ్.కు పంపి, దేశంలో లంబాడ భాషకు 'లిపి' లేదని నిర్ధారణ చేసుకుంది.

పూర్వం నుండి ప్రపంచంలో ఎన్నో భాషలు ఉన్నాయి. కానీ, వాటిలో కొన్నింటికి లిపిని ఎవరు కనిపెట్టారో కూడా తెలియదు. ఎలా సృష్టించబడ్డాయో కూడా తెలియదు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని లంబాడ, కోయ, ఎరుకలి భాషలకు ఇంతవరకు 'లిపి' లేదు. వీటిలో లంబాడ (బంజార) జాతివాళ్ళు ఎక్కువ శాతం ఉన్నారు. ఈ లిపిలేని భాషలు, జాతులు తమ సంస్కృతి, సాంప్రదాయాలను గ్రంధస్తం చేసుకోలేక ఎన్నో ఇబ్బందులు పడుతున్నాయి. అలా కొన్ని సాంప్రదాయాలు కనుమరుగై పోయే పరిస్థితి వచ్చింది. ఇలాంటి వారి సంస్కృతి, సాంప్రదాయాలను గ్రంధస్తం చేయటం ద్వారా బ్రతికించుకోవాలని ఒక మంచి పనికి అంకురార్పణ చేసిన రమేష్ ఎంతో అభినందనీయుడు.

తన లిపి నూటికి నూరుపాళ్ళు విజయవంతంగా 'లంబాడ' జాతి ప్రజల్లోకి వెళ్ళి వారి సంస్కృతి, సాంప్రదాయాలను కాపాడుతుందని, ఇందుకు అందరు దేవుళ్ళు, పెద్దల సహకారం, ఆశీస్సులు ఉండాలని కోరుకుంటున్నాడు రమేష్. ఈ లిపి విజయవంతమైన 'పల్లెసృజన' వెలుగులోకి తెచ్చిన ఎన్నో అంశాలలో ఇది కూడా చేరుతుందని ఆశిద్దాం. ఇది ఒక సామాన్యుని విజయం. ఈ లిపి తప్పికుండా లంబాడి తెగకు ఉపయోగ పడాలని 'పల్లెసృజన' మనసారా కోరుకుంటోంది.

రమేష్‌నాథ్ ఇప్పటికే 'అంతర్యామి' అనే ఒక పుస్తకాన్ని కూడా వ్రాయటం జరిగింది. అంతేకాదు, 'బట్టతల'మీద వెంట్రుకలు మొలిచేందుకు ఒక ఔషధాన్ని, ఇంకా ఎన్నింటినో కనిపెట్టడం కూడా జరిగింది. తనకు ఈ వేదికలో స్థానం కల్పించిన 'పల్లెసృజన'కు, తాను లిపి తయారు చేయటంలో స్ఫూర్తినిచ్చిన అంధుల లిపి సృష్టికర్త కీ.శే. బ్రెయిలీ బాయిష్ గారికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాడు రమేష్.

2007లో ఒకరోజు చిన్నశోధయాత్ర నిజామాబాద్ లో జరిగింది. స్థానిక విద్యార్థులు, ఇన్నోవేటర్ల సహాయంతో 30 కి.మీ. దూరంలో వున్న లంబాడా తాండాలకు వెళ్ళడం, వారి సాంప్రదాయ జ్ఞానాన్ని వెతికి తీసుకు రావడం జరిగింది. ఆ సందర్భంలో పిల్లలతో మాట్లాడుతున్నపుడు వారు మా లంబాడా భాషకు లిపి ఉండాలన్న కోరికను వ్యక్తం చేశారు. ఒక లంబాడా బాలిక నేను లిపిని సృష్టిస్తానన్న విశ్వాసం వ్యక్తం చేసింది. మాద రమేశ్‌నాథ్ సృష్టించిన ఈ లిపి ఆ చిన్నారుల కోరికను తీరుస్తుందని విశ్వసిస్తున్నాం.

**రమేష్ ఫోన్ నెం. 88512 45986.**

## పల్లెసృజన కార్యాలయంలో ఇన్నోవేషన్ల విస్తృత కేంద్రం

**దేశవ్యాప్తంగా పునాదిస్థాయి ఇన్నోవేటర్లు (గ్రామీణ శాస్త్రవేత్తలు) తయారు చేసిన ఇన్నోవేషన్ల ప్రదర్శన 'పల్లెసృజన' కార్యాలయంలో ఏర్పాటు చేయడమైనది. ఈ ప్రదర్శనను పాఠశాల, ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు, రైతులు సందర్శిస్తున్నారు. రైతులు ఈప్రదర్శనను చూస్తే వారికి అవసరమైన పనిముట్లను గుర్తించి వాటిని లాభకరంగా వినియోగించుకునే అవకాశం లభించటంతో పాటు, దేశీయ జ్ఞానానికి చేయూతను అందించిన వారవుతారు. మీ సమస్యలను పల్లెసృజనతో చర్చించవచ్చు.**


విక్రం రాథోడ్ సైకిల్ పంపు



రోషన్‌లాల్ విశ్వకర్మ చెరుకు కణుపులను కత్తిరించే సాధనం



గోపాల్ భిసే సైకిల్ నాగలి



మల్లేష్‌సోలార్ స్ప్రేయర్, లైటు ఫ్యాన్ల రిమోట్

**హైదరాబాద్ వచ్చినపుడు 'పల్లెసృజన' కార్యాలయాన్ని తప్పక దర్శించండి. ముందుగా మా కార్యాలయానికి సందేశాన్నిస్తే మీ సందర్శనను అర్థవంతంగా చేస్తాం.**

'పల్లెసృజన' కార్యాలయం చిరునామా :

**67, రోడ్ నెం. 2, వాయుపురి,**
**సైనిక్‌పురి పోస్టు, సికింద్రాబాద్ – 500 094.**
**ఫోన్ : 040–27111959,**
**సెల్ : 96528 01700.**

**ఒకరిని ఓడించడం చాలా సులువు, మరొకర్ని గెలుచుకోవటమే చాలా కష్టం.**



# కూలీల ఖర్చు తగ్గించే పురుగు మందు పిచికారి విధానం యువ రైతు శివకుమార్ ఆవిష్కరణ

నెల్లూరు జిల్లా కేంద్రానికి 55 కి.మీ. దూరంలో గల చేజర్ల మండలం, చిట్టలూరు గ్రామానికి చెందిన 'శివ కుమార్' అనే రైతు పంటలపై పురుగు మందును పిచికారి చేసేందుకు కొత్త పద్ధతిని కనిపెట్టాడు. సాధారణంగా పంటలకు పురుగు మందు పిచికారి చేయాలంటే నీరు మోసేందుకు, పిచికారి చేసేందుకు కూలీలు అవసరం. ట్రాక్టరు సహాయంతో పిచికారి చేసే యంత్రాలు అందుబాటులో వున్నా, ఆ విధానంలో కూడా ఇద్దరు కూలీలు అవసరమే. ప్రస్తుతం కూలీల భారంతో వ్యవసాయ ఖర్చులు పెరిగిపోతుండటంతో ఈ కూలీల ఖర్చును తగ్గించేందుకు శివకుమార్ పురుగు మందు పిచికారి పరికరాలను తయారు చేశాడు.

ప్రస్తుతం మార్కెట్‌లో లభిస్తున్న, పల్లెసృజన ఇన్నోవేటర్ సుభాని తయారు చేసి బూమ్ స్ప్రేయర్ కే వాహనాల అద్దాలను శుభ్రపరిచే 'వైపర్'లను స్రేయర్‌లో మందును చిమ్మే నాజిళ్ళకు అమర్చాడు. పిచికారి యంత్రం దానంతట అదే కదిలేలా ఏర్పాటు చేశాడు. ఇలా చేయటం వల్ల ట్రాక్టర్ నడిపే వ్యక్తి ఒక్కడే పురుగు మందును పంటపై చల్లేందుకు అవకాశము ఏర్పడింది. పురుగు మందు నింపే డ్రమ్ములోకి నీళ్ళు నింపడానికి కూడా ట్రాక్టరు పైననే ఒక నీటి పంపును ఏర్పాటు చేయటంతో ఒకే వ్యక్తి పురుగు మందును డ్రమ్ములో వేసుకుని మోటర్ సహాయంతో అందులో నీరు నింపి, అతనే పొలంపై పురుగు మందును పిచికారి చేస్తాడు.

ఇలా చేయటం వల్ల రోజుకు దాదాపు రూ. 600 రూపాయల కూలీల ఖర్చును ఆదా చేయగలుగుతున్నాను

**అందరికీ సమానమైన ప్రతిభ ఉండకపోవచ్చు కానీ ప్రతిభను పెంచుకునే అవకాశాలు అందరికీ సమానమే.**

అంటాడు శివకుమార్. దీన్ని తయారు చేయటానికి దాదాపు 15 వేల రూపాయల దాకా ఖర్చయింది అన్నాడు. ఇందుకు అవసరమైన కొంత సామాగ్రిని కడప జిల్లా ప్రొద్దుటూరు నుండి తెప్పించుకున్నాడు.

ప్రభుత్వ రాయితీతో దాదాపు 13 వేల ఖరీదు చేసి ట్రాక్టరు స్ప్రేయర్‌ను కొనుగోలు చేసి, ట్రాక్టరు మధ్యలో 500 లీటర్ల నీటి సామర్థ్యం గల ఒక ట్యాంకును ఏర్పాటు చేసి, దానికి ఇరువైపులా 2 మీటర్ల పొడవు గల ఒక చక్రాన్ని ఏర్పాటు చేశాడు. దానికి వైపర్లు అమర్చిన పిచికారి నాజిళ్ళను ఏర్పాటు చేశాడు.

ప్రస్తుతం ఈ పరికరం ద్వారా రోజుకు 40 నుండి 60 ఎకరాల వరకు పొలంలో పురుగు మందులను పిచికారి చేస్తున్నాడు. ఈ స్ప్రేయర్ ద్వారా మామూలుగా మార్కెట్‌లో లభించే స్ప్రేయర్‌కన్నా 10 రెట్లు ఎక్కువ చేసుకోవచ్చునని, పైగా కూలీల ఖర్చు 5 రెట్లు తగ్గుతుందని అంటాడు శివకుమార్. నాజిళ్ళకు వైపర్‌ను అమర్చడం వల్ల పొలం మొత్తం ఒకవేధంగా మందు పిచికారి చేయవచ్చు అంటాడు.

పదవ తరగతి వరకు మాత్రమే చదువుకున్న ఈశ్వరయ్య కుమారుడు శివకుమార్‌కు దాదాపు 8 సంవత్సరాల వ్యవసాయ అనుభవం వుంది. ఇతను తయారు చేసిన పిచికారి పరికరాన్ని చుట్టుప్రక్కల గ్రామీణులు ఎంతగానో సంతోషించి ఇతను తయారు చేసిన స్ప్రేయర్‌ను వినియోగించుకుని తమ పొలాలకు పురుగు మందును పిచికారి చేసుకుంటున్నారు.

ఇన్నోవేటర్ శివకుమార్ ఫోన్ నెం. : 9492877153

## నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ (ఎన్.ఐ.ఎఫ్.) - ఇండియా

స్వయం ప్రతిపత్తిగల సంస్థ, శాస్త్ర సాంకేతిక శాఖ, భారత ప్రభుత్వము

## జాతీయ 10వ ద్వైవార్షిక పోటీలు

### పునాది స్థాయిలో సహాయం అందని సాంకేతిక ఆవిష్కరణలు (ఇన్నోవేషన్లు) మరియు సంప్రదాయ జ్ఞానముల గుర్తింపు

**నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్** (ఎన్.ఐ.ఎఫ్.), 10వ ద్వైవార్షిక పోటీలకై మనదేశం నలుమూలల్లో పునాది స్థాయిలో దాగివున్న సహాయం అందని సాంకేతిక ఆవిష్కరణలను మరియు సంప్రదాయ విజ్ఞానాన్ని వెలుగులోకి తెచ్చేందుకు ఎన్.ఐ.ఎఫ్. కృషి చేస్తోంది. కర్షకులు, కార్మికులు, జాలరివారు, వర్క్‌షాప్ మెకానిక్‌లు, మురికి వాడలలో నివసించువారు, మహిళలు, విద్యార్థులు మరియు సమాజంలోని ఎవరైనను ఈ పోటీలో పాల్గొనవచ్చును. మీయొక్క ఆవిష్కరణలు వ్యవసాయము (పనిముట్లు, యంత్రములు, క్రొత్త పద్ధతులు, కొత్త వంగడాలు మొదలగునవి), గృహోపకరణాలు, రవాణా, ఎనర్జి (శక్తి) ఉత్పత్తి/పరిరక్షణ, పనిభారం తగ్గించటం, మూలికా వైద్యము (మానవ మరియు జంతు సంబంధమైన) మొదలగువాటికి సంబంధించినవై మరియు తక్కువ ఖర్చుతో కూడుకుని ఎక్కువ కాలం మనగలిగి పర్యావరణానికి హానికరం కానివై ఉండాలి. ఈ ఆవిష్కరణలు మీ సొంత సృజనతో ఎటువంటి సాంకేతిక మద్దతు, పర్యవేక్షణ లేకుండా సహాయం/గుర్తింపు పొందనివై ఉండాలి. మహిళలు మరియు వికలాంగుల యొక్క ఆవిష్కరణలు/ సంప్రదాయ విజ్ఞానానికి ప్రత్యేక బహుమతులు ఇవ్వబడతాయి. చిన్నపిల్లలను (స్కూల్‌కి వెళ్ళేవారు మరియు వెళ్ళనివారు) వారియొక్క సొంత ఆలోచనలను (Original Ideas) పంపమని ప్రోత్సహిస్తున్నాము. సాంకేతిక ఆవిష్కరణలకు సంబంధించిన నమూనాలు (Prototypes), అభివృద్ధి చేయని సృజనాత్మక ఆలోచనలను (Creative ideas) కూడా ఆహ్వానిస్తున్నాము.

వివిధ కేటగిరీలలో బహుమతి ఒక్కటికి రూ. 10,000 నుండి రూ. 7,50,000 వరకు ఉంటుంది. జీవిత కాలపు, జాతీయ మొదటి, రెండవ, మూడవ పురస్కారాలు పొందిన వారికి బహుమతి మొత్తంలో కొంత భాగాన్ని ఉపకార వేతనము (Fellowship) రూపములో (జీవిత కాలపు పురస్కారం పొందిన వారికి 5 సంవత్సరాలు, జాతీయ మొదటి, రెండవ, మూడవ పురస్కారాలు పొందినవారికి వరుసగా 3 సంవత్సరాలు, 2 సంవత్సరాలు, 1 సంవత్సరము) ఇస్తారు. మొత్తము బహుమతిలో పదిహేను శాతం (15%)ను ఆవిష్కరణకర్త(లు) వారి సమాజ సంక్షేమానికి మరియు ప్రకృతికిసంబంధించిన కార్యక్రమాలలో వినియోగించవలసి ఉంటుంది.

పునాది స్థాయిలో ఆవిష్కరణలను మరియు సంప్రదాయ విజ్ఞానాన్ని ప్రోత్సహిస్తున్న వ్యక్తులకు, సంస్థలకు విలేఖరులకు మరియు ప్రజల యొక్క విజ్ఞానానికి/ సృజనాత్మకతకు విలువను జోడించి ప్రభావితం చేస్తున్న నిపుణులకు **ప్రత్యేక గుర్తింపు** ఉంటుంది. వ్యక్తులు లేదా సంస్థలు వారి ఆవిష్కరణలు ఎన్నయినా **31 మార్చి, 2017** లోగా మాకు చేరేలా పంపండి.

**మీ ఆవిష్కరణలను పంపవలసిన చిరునామా :**

**National Innovation Foundation-India, Satellite Complex,**
**Premchand Nagar Road, Ahmedabad -380 015, Gujarat**
**Phone: (079) 26732456, 2095, Fax: (079) 26731903,**
**Email: campaign@nifindia.org,**
**Website: www.nif.org.in**

**గమనిక :** వృత్తిపరమైన నేపథ్యం/ అనుభవం ఉన్నవారు మరియు వృత్తివిద్యా కోర్సులలో ఉన్న విద్యార్థులు ఆవిష్కరణలు / ప్రతిపాదనలు పంపుటకు అర్హులు కారు. అయితే పునాది స్థాయిలో ఆవిష్కరణలకు విలువను జోడించుటకు వారి సేవలను ఎన్.ఐ.ఎఫ్. ఆహ్వానిస్తోంది. అర్హతలు మరియు సూచనలకు సంబంధించి మరిన్ని వివరాలకు వెబ్‌సైట్ http://www.nif.org.in/announcement.చూడండి.

మీ ప్రమేయం లేకుండా మీరు ఏదీ సాధించలేరు. మీ ప్రమేయమే ఉంటే ఎప్పటికీ ఓడిపోలేరు.

పశ్చిమ గోదావరి జిల్లా 'కన్నాపురం' నుండి 'కొండ్రకోట' వరకు (8-10 జనవరి, 2016) జరిగిన

# 17వ చిన్న శోధయాత్ర - జ్ఞానయాత్ర

## యాత్రీకుల అనుభవాలు



**జి. శివకుమార్, శ్రీపాద డిగ్రీ కళాశాల, విశాఖపట్టణం :**

నేను శ్రీపాద డిగ్రీ కళాశాలలోనే చదువుకొని అక్కడే ఉద్యోగం చేస్తున్నాను. నాకీ చిన్నశోధయాత్ర గురించి మా కళాశాల కరస్పాండెంట్ అంజిరెడ్డి గారి ద్వారా తెలిసింది. నిజం చెప్పాలంటే నాకీ శోధయాత్ర గురించి, పల్లెసృజన గురించి ఏమీ తెలియదు. అదే అడిగాను. ఆయన కొంత వివరించి, పల్లెసృజన వాళ్ళ వెబ్‌సైట్ చూడు అన్నారు. చూసే అవకాశం దొరకలేదు. కాకపోతే అప్పటికి నాకర్థమైంది ఏమిటంటే, ఈ యాత్రలో గ్రామ ప్రజలు, వారి జీవన విధానం, వారి సమస్యలకి వారే వారి తెలివి తేటలతో ఎలా పరిష్కారాలు కనుగొన్నారో తెలుసుకోవటం..... మొదలైనవి వుంటాయి అని. సరే తినబోతూ రుచెందుకు అని యాత్రకు వెళ్ళాలని నిశ్చయించుకున్నాను.

జనవరి 27, 2016 సాయంత్రం విశాఖ పట్టణంలో బయలుదేరి మర్నాడు ఉదయం 3-30 గంటలకి రాజమండ్రి చేరుకున్నాను. అక్కడినుండి బస్సు పట్టుకుని కొయ్యల గూడెం చేరుకొని అక్కడినుండి కన్నాపురం చేరి, మున్సిపల్ ఆఫీసు దగ్గర తేలాను. అక్కడ బాపూజీ గారిని కలిశాను. ఆయన చెప్పినదాని ప్రకారం మనం రోజూ చూసే అనేక విషయాల నుంచి కూడా తెలుసుకోవలసినవి చాలా వుందని అర్థమైంది. తర్వాత బ్రిగేడియర్ గణేశం గారు మా గుంపులో చేరారు. చక్కగా నేలమీద కూర్చుని అందరి పరిచయాలు అయ్యాక 'వాక్' గురించి చెప్పారు. ఆయన దృష్టిలో 'వాక్' అంటే "డబ్ల్యు-విజ్‌డమ్, ఎ- యాక్సెప్టెన్స్, ఎల్- లవ్, కె- నాలెడ్జ్" అని. అప్పుడు ఆయన చెప్పిన దాని ప్రాముఖ్యత నాకు అర్థం కాలేదు. కన్నాపురం నుంచి మా

**మీరు మీ కర్తవ్యానికి సెల్యూట్ చేస్తే ఇంకెవరికీ సెల్యూట్ చెయ్యవలసిన అవసరం లేదు.**
**కానీ మీరు మీ కర్తవ్యాన్ని పొల్యూట్ చేస్తే అందరికీ సెల్యూట్ చెయ్యాల్సి వస్తుంది.**



యాత్ర ప్రారంభమైంది. బ్రిగేడియర్ గారన్నారు..... ఈరోజు సాయంత్రానికల్లా ఈ యాత్రలోని సభ్యులందరూ ఎవరు ఎవరో అందరికీ తెలియాలి కనుక పరిచయాలు పెంచుకోండి అన్నారు. అదే చేస్తూ యాత్ర కొనసాగించాం.

ఆయన చెప్పినదాని ప్రకారం గ్రామస్తులు తమ పరిసర ప్రాంతాల్లో సహజంగా దొరికే ప్రకృతిసిద్ధమైన మూలికలను విస్మరించి, శరీరానికి హానికరమైన రసాయన మందుల వైపు మొగ్గు చూపుతున్నారు. నిజమే అనిపించింది. తోవలో ఒక వయసుమళ్ళిన ఆయన తన సైకిల్‌పై ఒక కట్టెల మోపును తీసుకుని వస్తూ కనిపించాడు. అతన్ని ఆపి పలకరించాం. తాను దాదాపు 2 కి.మీ. దూరం నుండి ఈ కట్టెలను తెస్తున్నాను అన్నాడు. మాలో కొందరు ఆ సైకిల్‌ను నడపాలని ప్రయత్నించారు. 10 అడుగులు కూడా వేయలేకపోయాము. దానికతను నవ్వుతూ బరువున్న సైకిల్ పడిపోకుండా వుండటానికి రెండు కట్టెలతో స్టాండులాగా చేసుకున్నానని, కనుకనే కట్టెలతో బరువుగా వున్న సైకిలు పడిపోకుండా తాను తోస్తూ వెళ్ళగలనని చెప్పారు. ఇదీ చక్కని ఇన్నోవేషనే కదా అనిపించింది. గణేశం గారు ఉదయం చెప్పిన 'డబ్ల్యు' కి అర్థం దొరికింది. అతన్ని అభినందించి, శాలువాతో సత్కరించి ముందుకు సాగాము.

తరువాత యాత్రలో భాగంగా 'పులిరామన్న గూడెం' లోని పాఠశాలకు వెళ్ళాం. అక్కడ పిల్లలకి గ్రామీణ రైతులు చేసిన అనేక ఇన్నోవేషన్ల గురించి వివరించి, వీడియోలు చూపించి, మీకు తోచిన ఆలోచనలు వ్రాయమని అడిగాము. ఎన్నో ఆలోచనలు వ్రాసిచ్చారు. వాళ్ళ ఆలోచనా శక్తికి ఆశ్చర్యం వేసింది. అక్కడ సెలవు తీసుకొని మళ్ళీ యాత్ర కొనసాగించాం. చీకటి పడిపోయింది. మార్గంలో వీధి దీపాలు లేవు. ఇంతలో ఎక్కడినుంచి వచ్చాయో పెద్దసంఖ్యలో మిణుగురు పురుగులు వచ్చాయి. బ్రిగేడియర్ గారు ఎవరూ టార్చిలైట్లు వెలిగించొద్దు, గట్టిగా మాట్లాడొద్దు అని హెచ్చరించారు. వాటిని చూస్తూ ముందుకు సాగాము. అవే మాకు దోవ చూపించాయేమో కూడా. తర్వాత అనిపించింది ప్రకృతిలో సహజంగా వుండే వాటికి భంగం కలిగించకుండా, వాటితో కలిసి జీవించాలి అని గణేశం గారు చెప్పే మాటలకి అర్థం.

ఆరాత్రి బసకి చేరుకున్న తర్వాత యాత్రీకుల అనుభవాలు ఒకరికొకరం చెప్పుకొన్నాము. అప్పుడు తెలిసింది 'ఎ' కి అర్థం. ప్రకృతిని అది సహజ సిద్ధంగా వుండే రూపంలోనే మనం 'యాక్సెప్ట్' చెయ్యాలి అని. నిశ్శబ్దంగా, ప్రశాంతంగా వున్న ప్రకృతితో కలసి నిద్రపోయాము ఆరోజు.

మర్నాడు ఉదయం కాలకృత్యాలు తీర్చుకొని యాత్ర కొనసాగించాం. ఆరోజు దాదాపు 25 కి.మీ. నడవాలి. అందరి ఆలోచన అంతదూరం నడవ గలమా? క్షేమంగా ఆరోజు గమ్యం చేరుకోగలమా? అన్నదే. దానికి తగ్గట్టు తోవలో అటవీశాఖ అధికారులు ఇది రక్షిత ప్రాంతమని, క్రూర మృగాలు ఉండవచ్చునని, నక్సలైట్లు కూడా కనిపించ వచ్చునని చెప్పారు. బెరుకుగానే యాత్ర సాగించాం. మార్గ మధ్యంలో మాలో మేము మాట్లాడుకుంటూ తారస



కేవలం విజయగాథలు చదివితే వివరాలు మాత్రమే తెలుస్తాయి. అదే అపజయాల కథలు చదివితే విజయాలకి మార్గం దొరుకుతుంది.



పద్దవారిని ప్రేమతో పలుకరిస్తూ, వారు ఆప్యాయంగా చెప్పే సమాధానాలు వింటూ బ్రిగేడియర్ గారు చెప్పే అనేక ఇన్నోవేషన్ల కథలు వింటూ ముందుకు సాగాము. అప్పుడు తెలిసింది 'ఎల్' కి అర్థం – 'పక్కవాడ్ని ప్రేమిస్తే, గౌరవిస్తే అదే భావన వాళ్ళూ మనకి చూపుతారు' అని.

ఈ యాత్ర చివరిలో 'కె' కి అర్థం తెలిసింది – 'ఈ ప్రపంచంలోని ప్రతి వ్యక్తి దగ్గర 'కె' (నాలెడ్జ్) వుంది. మనం చేయవలసిందల్లా పలకరించి తెలుసుకోవటమే. వ్యక్తులే కాదు, ప్రకృతిలోను జ్ఞానం వుంది. అది తెలుసుకునే సామర్థ్యం పెంచుకోవాలి. ఇంతా చెప్పినాక ఈ శోధయాత్రలో నేను తెలుసుకున్న ముఖ్య విషయం – నాగురించి నేను తెలుసుకోవటం. నేను ఎవరిని? ఏం చెయ్యాలి? ఏమి చేయగలం? ఎన్ని అవకాశాలున్నాయి? ఇవన్నీ మొదటిసారి నాకు తెలిశాయి. యాత్ర ప్రారంభలో వున్న 'నేను' యాత్ర పూర్తయిన తర్వాత 'నేను' వేరువేరు అనిపించింది.

మొత్తానికి నేనెవరో నాకు చూపించిన చిన్న శోధయాత్రకి, తోటి యాత్రీకులకి, అది నిర్వహించిన 'పల్లెసృజన'కి ధన్యవాదాలు చెప్పకుండా ఉండలేను. ఇంకొక్కసారి అవకాశం వస్తే తప్పకుండా పాల్గొనాలనే నిర్ణయం తోటి ఈ యాత్ర ముగించాను.

**ఇతర యాత్రీకుల అభిప్రయాలు :**

**8 జనవరి, 2016 :**

చిన్నశోధయాత్రలో పాల్గొన్న దాదాపు 45 మంది అనుభవాలు క్రోడీకరించగా ఈ క్రమంలో ఉన్నాయి.

❀ కన్నాపురంలో యాత్ర ప్రారంభం.

❀ 'కాళీబా' అనే ఒక పెద్దామె తోవలో గుంటలలో నీళ్ళు తాగొద్దు అని సలహా.

❀ గణేశం గారు వివిధ ఇన్నోవేటర్ల కథలు చెప్తూ వుండగా యాత్ర కొనసాగింది. గ్రామీణులు వాళ్ళ సమస్యలను వారికున్న పరిధిలో ఎక్కువ ఖర్చు లేకుండా వాళ్ళే తీర్చుకునే పద్ధతి అమోఘం. దీనిలో మన పాత్ర "ఒకచోటు నుంచి మరొకచోటుకి జ్ఞానాన్ని చేరవేయడమే".

❀ ముళ్ళపూడి సత్యనారాయణ తయారు చేసిన మినీ టిల్లర్ గురించి తెలుసుకున్నాం.

❀ అంజిరెడ్డి గారు వివిధ మొక్కలు, వాటి ఔషధ గుణాలు చెప్తూ వుంటే తెలుసుకున్నాం.

❀ చీమలవారి గూడెం గ్రామంలో 'సూర్యప్పడు' అనే పెద్దాయన తనకి సైకిల్ తొక్కడం రాకపోయినా సైకిల్‌పై కట్టెల మోపుని ఎలా తీసుకు వెళుతున్నాడో తెలుసుకుని సత్కరించాం.

❀ మర్రిచెట్టు ఊడలతో రూపొందించిన ఇంటిని చూశాం.

❀ 'పోశిరెడ్డి' అనే పెద్దాయన తాటికల్లు తీయటానికి కుండలకన్నా, 'వెదురు బుంగ' వాడితే ఎక్కువ కల్లు వస్తుందని తెలుసుకుని ఆశ్చర్యపోయాము.

❀ గాదెలు తయారు చేయటం తెలుసుకుంటూ మెరక గూడెం మీదుగా ముందుకు సాగాము.

❀ 'నాగపెంచలమ్మ' గుడి ఆవరణలో భోజనం చేసాము.

❀ పులిరామన్న గూడెంలో పాఠశాల పిల్లలను కలిసి వారికి ఇన్నోవేషన్ల గురించి చెప్పి, వాళ్ళ ఆలోచనలను సేకరించాము.

❀ రక్షిత వన్య ప్రాంతం గుండా 'కన్నారప్పాడు' గ్రామం చేరాము. అక్కడ అంజిరెడ్డి గారు ఆదివాసులు పాలు, పాలనుండి వచ్చే పదార్థాలను ఎందుకు వాడరో దాని కారణాలను తెలియజేశారు.

❀ పాండురంగారావు తయారు చేసిన 'పంచరు కాని ట్యూబు' గురించి, కరెంటు స్తంభాలనెక్కే చెప్పులను గురించి తెలుసుకుంటూ ముందుకు సాగాము.

❀ 'మంజులూరు' గ్రామం దాటి 'చింతపల్లి' గ్రామం

**దేశంలో చాలా తెలివైన వారు పాఠశాల గదుల్లో చివరి బెంచీలో కూర్చువారై ఉండొచ్చు.**



చేరుకుని ఆరోజు అనుభవాలను చెప్పుకుంటూ భోజనం చేసి విశ్రమించాము.

**9 జనవరి, 2016 :**

❀ బడి ఆవరణని శుభ్రం చేసి, మనం బస చేసే ప్రదేశం మనం వచ్చినప్పటికన్నా వెళ్ళేటప్పుడు ఇంకా శుభ్రంగా వుండాలి అన్న సూత్రం పాటించాం.

❀ వెంకట కృష్ణుడు గారి సేంద్రియ పురుగు మందు మరియు మొక్కల ఎదుగుదలకు పనిచేసే 'తులసి' ని గురించి మాట్లాడుకుంటూ 'గన్నేపల్లి' చేరుకున్నాం.

❀ చిన్న చిన్న బొమ్మల తయారీ చూశాం.

– రోడ్డు ప్రక్కనే అల్పాహారం తీసుకుని మునిరత్నం నాయుడు ఆచరిస్తున్న సేంద్రియ వ్యవసాయ పద్ధతులు, పశ్చిమ గోగుల పల్లిలోని ఉప్పు తయారీ విధానాలను గురించి మాట్లాడు కుంటూ ముందుకు సాగాము.

❀ నర్సు 'మంగ తయారు' గారు మాకు త్రాగడానికి నీళ్ళిచ్చి సేద తీర్చారు.

❀ ఒకింట్లో మైనా పిట్టను చూశాం. అడవిగుండా ప్రయాణించాం. జలపాతాలు చూశాం. అరటి చెట్ల మధ్యన నడిచాం.

❀ రాష్ట్రపతి పురస్కార గ్రహీత మల్లేశం తయారు చేసిన 'ఆసు యంత్రం' పోచంపల్లి ప్రాంతంలోని నేత కార్మికుల జీవన విధానాన్ని ఏవిధంగా మార్చేసిందో తెలుసుకుంటూ ముందుకు సాగాము.

❀ అటవీశాఖ అధికారి 'విజయ్' గారు తోడురాగా, 'భాను' గారి సహాయంతో రక్షిత అడివిగుండా ప్రయాణం సాగించి 'కొట్టూరు' చేరుకున్నాం.

❀ విజయ్ గారు మేము వచ్చిన మార్గం 13 ఘాట్‌లు వున్న 'దాసన్న' అనే వ్యక్తి పేరున వున్న 'దాసన్న మార్గం' అని చెప్పారు. 'పోలవరం' ప్రాజెక్టు పూర్తయితే ఆ ప్రాంతం రూపు రేఖలే మారుతాయని చెప్పారు. స్థానిక మహిళ సహాయంతో మేమే వంట చేసుకొని తృప్తిగా తిని, నిద్రపోయాము.

**10 జనవరిం, 2016 :**

❀ నదిలో స్నానం చేసి, కొంతసేపు పడవ ప్రయాణం చేసి, అల్పాహారం తీసుకొని, రాత్రి మాకు వంటకు సహాయం చేసిన మహిళను సత్కరించి యాత్ర ప్రారంభించాం.

❀ మధ్యేమార్గంలో చనిపోయిన పామును కూడా చూశాము. (చనిపోయింది కనుక ధైర్యంగా చూశాం).

❀ పక్కన వున్న కుళాయి నుండి బాటిళ్ళలో నీళ్ళు నింపి పొలాల మధ్యగా దగ్గరి దారిలో 'టేకూరు' గ్రామం చేరుకున్నాం.

❀ 'మేథా' గారు అందరికీ వేడివేడి బజ్జీలు, బోండాలు తినిపించారు. ప్రాణం లేచివచ్చింది.

❀ అక్కడొక ట్రాక్టరు, ఆటో తీసుకుని 'పోలవరం' చేరుకున్నాం. మార్గంలో 'పోలవరం ప్రాజెక్టు' పనులు జరుగుతున్న తీరుతెన్నులు చూశాం.

❀ పోలవరంలో భోజనం చేసి, యాత్రలో అనుభవాలను చెప్పుకుని మళ్ళీ ఎంత త్వరలో కలుసుకుంటే బావుంటుంది అనుకుంటూ యాత్ర ముగించాము.

ఈ యాత్రలో ఎయిర్ కండిషన్ గదులు లేవు, ఎయిర్ కండిషన్ వాహనాలు లేవు, షడ్రషోపేతమైన విందులు లేవు.... కానీ, వీటన్నిటికన్నా మించిన అనుభవం, కాలి నడకన వెళ్తూ పేర కూడా వినని గ్రామాలను సందర్శిస్తూ, స్వచ్ఛమైన మనసుతో నోరారా పలకరించి, కడుపారా సామాన్య భోజనం పెట్టే ప్రజలని కలుస్తూ, ప్రకృతిని ఆస్వాదిస్తూ, కూడా తీసుకు వెళ్ళిన జంపఖానాలు కూడా వద్దు, కటిక నేలమీద పడుకుందామని అనిపించే ఈ శోధయాత్ర అనుభవాలు చాలా గొప్పవి. ఈ అనభవాలు రాస్తే చదవటంకన్నా, వ్యక్తిగతంగా పాలుపంచుకుంటే పూర్తి అవగాహన వుంటుంది. ఇటువంటి అనుభవాలని కలిగించిన 'పల్లెసృజన' బృందానికి ఎన్ని ధన్యవాదాలో

**నీవు నీ భవిష్యత్తుని మార్చుకోలేవు. కానీ నీ అలవాట్లను మార్చుకోగలవు. తర్వాత నీ అలవాట్లే నీ భవిష్యత్తుని మారుస్తాయి.**

# ఒక భారతీయ సగటు రైతు కథ

ధారావాహికం 4వ భాగం

- చల్లా కృష్ణారెడ్డి, గుంటూరు జిల్లా.

ఆయనవిషయమై నాకింకనూ క్లారిటీ రాలేదు. సరే చూద్దాం, ఆర్థికంగా నాకేదైనా సహాయం చేస్తాడేమోనని భావించాను. కానీ ఆయన నా విషయవేమీ పట్టించుకున్నట్లు లేదు. అసలు నా విషయం ఆయనకు తెలిసినట్లు కూడా లేదు. అలా రెండురోజులు గడిచిపోయాయి. తర్వాత ఆశ్రమ నిర్వాహకులు ఒక లెటరు వ్రాసి నీ వృత్తాంతం అంతా ఆయన చేతికి అందించు ఆయన చదువుతాడు అని చెప్తే అలా చేశాను. ఉదయం లెటరు ఇచ్చాను. సాయంత్రం నాకు ఇంటర్‌వ్యూ ఇస్తాడు అనుకున్నాను. కానీ లైనులోనే నిలబెట్టి, ఎక్కడినుంచి వచ్చావు దున్నపోతులాగా తిని తిరుగుతున్నావా అని నన్ను మందలించాడు. చివరగా అలా ఎప్పటికీ చేసుకోకూడదమ్మా అంటూ అరచేతిలో విభూదిని తీసి నాకు ప్రసాదంగా ఇచ్చాడు. సరే ఆయనపై నాకు నమ్మకమున్నా, లేకున్నా ఆ విభూదివల్ల నాకు మేలు జరుగుతుందో లేదో కానీ, నష్టమైతే లేదుగదా అని దాన్ని నోట్లో వేసుకున్నాను. కొంత విభూదిని నా కిలికి తగిలిన గాయానికి పూసుకున్నాను. కొద్ది రోజుల తర్వాత నా కాలు కొంచెం దృఢపడింది. అది సహజంగా ఏర్పడినది కావచ్చు, లేదా విభూది మహిమ వల్ల కావచ్చునేమో అని, ఆ విషయమై ఇంకా విచారించాలి అనే పట్టుదలతో పొరుగున దగ్గిరలో వున్న ఊరు 'కొత్త చెరువు' వెళ్ళాను. అక్కడికి వెళ్ళి ఒక టైలరు షాపులో పనికి కుదిరాను. నాకు భోజనం పెడితే చాలు మిషను కుతడాను, తర్వాత నేను వెళ్ళేటపుడు చార్జీకి డబ్బులు ఇస్తే చాలు అన్నాను. అతను, అతని భార్య, వారికొక చిన్న పిల్లవాడు వున్నారు. వాళ్ళు సరేనని ఒప్పుకున్నారు. ఒక పదిహేను రోజులు వారివద్ద ఆడవాళ్ళ 'లోపలి లంగాలు' కుట్టుకుంటూ ఉన్నాను. అతను, వాళ్ళ అమ్మా నాన్న సత్యసాయిబాబా గారికి ప్రశాంతి నిలయంలో వంట చేసిపెట్టేవాళ్ళు. వారి ద్వారా బాబా గారి గురించి తెలుసుకోవటానికి కొంత అవకాశం కలిగింది.



వారు బాబాగారి వద్దనే బాగా సన్నిహితంగా వుండి అన్నం వండి పెట్టేవారు కనుక ఆయనను గురించి కొంతైనా వారికి బాగా తెలిసి వుంటుంది అని ఆయన గురించి పరిశీలనగా అడగటం మొదలు పెట్టాను. షాపు ఓనరు అతనికి నా విషయమంతా పూసగుచ్చినట్లు చెప్పియున్నాడు. వారి తల్లిదండ్రులతో మాత్రం నాకు మాట్లాడటానికి కుదరలేదు. నా విషయమంతా విన్న తర్వాత అతను బాబా గారి గురించి ఒక విషయం నాకు చెప్పాడు. అది విన్న తర్వాత నాకు పుట్టపర్తి వెళ్ళాల్సిన అవసరం లేకుండా పోయింది. ఆ తర్వాత అక్కడి విషయాలను గురించి ఆలోచించ వలసిన అవసరం లేకుండా పోయింది. ఇక కుటుంబ విషయాలలో పూర్తిగా నిమగ్నం కావచ్చును అనిపించింది. టైలరు షాపు ఓనరు దగ్గర సెలవు తీసుకొని అతనితో చార్జీలకు డబ్బులు ఇప్పించుకొని ఇంటికి వచ్చేసాను.

స్వంతంగా మిషను కొనుక్కొని, ఇంకాస్త అనుభవం సంపాదించిన తర్వాత నాలుగైదు సంవత్సరాలు దానిపైనే

**నేర్చుకోవటం వల్ల సృజనాత్మకత వస్తుంది, సృజనాత్మకత ఆలోచనలకి దారి తీస్తుంది,**
**ఆలోచనలు జ్ఞానాన్నిస్తాయి, జ్ఞానం మిమ్మలను గొప్పవాళ్ళను చేస్తుంది.**

జీవనం కొనసాగించాను. ఆ తర్వాత ఓ గుడ్డల కొట్టు షాపు ఓనరు అంబాపురంలో కొత్తగా షాపు పెడుతూ నీకు పెట్టిబడితో పని లేదు, లాభంలో పావలా భాగం ఇస్తాను, నీవు సేల్స్‌మెన్‌గా వుండి కొట్టుని నడిపిస్తే చాలు అన్నాడు. అతను కొంత డబ్బు పెట్టుబడిగా పెట్టి, అమ్మకం కొనసాగించమని నాకు అప్పజెప్పాడు. నేను కుట్టు మిషన్‌ను ఆ షాపులోనే పెట్టుకొని, ఒక నాలుగైదు సంవత్సరాలు అలా జీవనం కొనసాగించాను. అతను ఏటా లాభాలలో నా వాటా నాకిచ్చి మిగతాది అతను తీసుకుంటూ వుండేవాడు. ఈ నాలుగు సంవత్సరాల్లో పెట్టుబడిదారుని సొమ్ము అంతా తిరిగి వచ్చేసింది. ఇప్పుడు లాభం మీదనే కొట్టు నడుస్తోంది. నాకు షాపువల్ల కొంత, టైలరింగు వల్ల కొంత ధనం మిగులుబాటు కావటంతో జీవితం సాఫీగానే సాగిపోతున్నది.

తర్వత బట్టల షాపు వాళ్ళ దగ్గర కొంత అప్పుగా తీసుకుని కొట్టు నడిపిస్తున్నాను. ఊర్లో కూడా రైతులకి అప్పుగా గుడ్డలు అమ్మి, సంవత్సరం అయిన తర్వాత పంటలు వచ్చినపుడు బాకీలు వసూలు చేసుకునే వాడిని. ఇలా జరుగుతుండగా ఒక సంవత్సరం పంటలు బాగా నష్టం వాటిల్లినందువల్ల రైతులు అప్పులు ఇవ్వలేక పోయారు. కొట్టు ఓనరు ఇక పెట్టుబడి పెట్టడానికి సిద్ధంగా లేడు. ఆ క్రమంలో పైబాకీల వాళ్ళు వత్తిడి చెయ్యటం, పోలీసు కేసులు పెట్టడం, కొట్టు నడిపించేవాడివి నీవే కనుక నీవే మా అప్పు తీర్చాలి అని నన్ను తీసుకెళ్ళి జైల్లో పెట్టించడం జరిగింది. ఒకరోజు తర్వాత ఆ కొట్టు ఓనరు కలగజేసుకొని నన్ను విడిపించి కొట్టువాళ్ళతో పెద్దమనుషుల ద్వారా ఒప్పందం కుదుర్చుకుని నన్ను వదిలేశాడు. అప్పటికి ఉన్న బాకీలు పంచుకుంటే పై బాకీలు పోను, కొంత మిగులుబాటు వుంటే డబ్బుఇవ్వలేనని, ఊళ్ళోని బాకీలు వసూలు చేసుకొమ్మని నాకు కొన్ని బాకీలను కేటాయించాడు. అవి నాకు వసూలు కానే లేదు. ఎందుకంటే కొట్టు తీసేసిన తర్వాత రైతులతో సంబంధాలు ఉండవు కనుక, వారు నాకు డబ్బు ఇవ్వరు. దాంతో వాటిని వదిలేసి వేరే పనికొరకు వెతుకులాట మొదలు పెట్టాను.

మళ్ళీ పొలం వైపుకు ఆలోచన మళ్ళింది. కొంత శక్తి పుంజుకున్నాను, శారీరకంగా, ఆర్థికంగా కూడా ఫర్వాలేదు. అప్పుడు ఇందిరాగాంధీ ప్రధాన మంత్రిగా ఉన్నారు. ఒక ఐదు ఎకరాలు పొలం కౌలుకు తీసుకుని సాగు చేయటానికి పూనుకున్నాను. ఒక సంవత్సరం పంటలో కొంత లాభం వచ్చింది, మరుసటి సంవత్సరం 12 ఎకరాలు కౌలుకు తీసుకొని సాగుకి పూనుకున్నాను. పెట్టుబడి కూడా బాగానే అందుబాటులో వున్నది. అప్పుడు ప్రత్తి రేటు క్వింటాలు 7 వందల రూపాయలుగా వున్నది. కౌలు కూడా ఎకరం 15 వందలు. పెట్టుబడికి ఎకరాకు 2 వేల రూపాయలు, నేను, నా భార్య, ఆమె తమ్ముడు కలిసి పొలం పనులు స్వంతంగా చేసుకుంటున్నాము. పొలం పనులకై ఒక దున్నపోతును కొని వ్యవసాయం చేస్తున్నాము. పంట చేతికి రాబోయే సరికి 7 వందల రూపాయలున్న ప్రత్తి కాస్తా 3 వందలకు రేటు పడిపోయింది. ఆ సంవత్సరమే తెల్లదోమ కొత్తగా వ్యవసాయ పంటలపై దాడి చెయ్యటం జరిగింది. ఆ క్రమంలో పంట 50 శాతం తగ్గటం, రేటు కూడా 50 శాతం తగ్గటంతో, ఎంతో కష్టపడి పండించిన పంట మొత్తం కౌలు కట్టడానికి మాత్రమే సరిపోయింది. నా కుటుంబ ఖర్చులు, పెట్టుబడి కోసం తెచ్చిన అప్పులు తీర్చలేక పోయాను.

అప్పటికే మా నాన్న కూడా నావద్దనే ఉండటంతో ఆయన పొలం ఒక ఎకరం అమ్మి నా బాకీలు తీర్చుకొమ్మ న్నాడు. అలా వున్న కాస్త భూమి కూడా అమ్మి, మళ్ళీ టైలరింగపైనే జీవనం సాగిస్తూ, ఒక ఆటో కొన్నాను. దాంతో మా ఊరి జనాన్ని బస్తీకి చేరవేస్తూ కొంత డబ్బు సంపాదిం చడం జరిగింది. దానితో ఫైనాన్స్ వారి సహకారంతో మరొక ఆటో కొని నా కొడుక్కు కూడా ఆటో నేర్పించి ఆటో డ్రైవర్‌ను చేశాను. వాడు కూడా నాలాగే గవర్నమెంటు స్కూళ్ళలో 10వ తరగతి వరకు చదివించి మాన్పించాను. ఇద్దరం ఆటో తోలుతూ జీవనం సాగిస్తూ, ఆటో కొరకు చేసిన అప్పులు తీర్చుకుని, మూడవ ఆటో కూడా తీసుకుని, నా బావమర్ది చేత తోలించాను. కొంత డబ్బు గడించడం జరిగింది. నా అభివృద్ధి కొంతమందికి నచ్చలేదు. **(సశేషం)** ●

ఈ ధారావాహికలో వెలిబుచ్చిన అభిప్రాయాలు రచయితకు సంబంధించినవి. 'పల్లెసృజన'నకు ఎటువంటి బాధ్యత లేదు. **– ఎడిటర్**

**మీ కలలను సాకారం చేసుకోవాలంటే మీరు ముందు కలలు కనాలి.**

# గుంటూరు 'ల్యామ్'లో జరిగిన దక్షిణ మండలం అగ్రి ఎక్స్‌పో-2015

































మేము తవేరా వాహనంలో 18 డిశంబరు, 2016 అర్ధరాత్రి గుంటూరు చేరాము. అక్కడి నుండి ఉదయం 9 గంటలకు 'ల్యామ్' ప్రదర్శన కేంద్రాన్ని చేరాము. 10–11 గంటల మధ్యలో అందరు ఇన్నోవేటర్లు వచ్చారు. మూడు రోజుల ప్రదర్శనలో చాలామంది రైతులు, అతితులు, ఆహ్వానితులు 'పల్లెసృజన' స్టాల్‌ని సందర్శించటమే కాక సజీవ ప్రదర్శనని కూడా చూసారు. మొత్తం ప్రదర్శనలో 'పల్లెసృజన' అందరినీ ఆకట్టుకున్నది. మేము సజీవ ప్రదర్శనలు, పోస్టర్లు, టీవీలో వీడియోల ద్వారా ఇన్నోవేషన్లను ప్రదర్శించాము.

రెండవరోజు పండరి గారు చక్కని సమావేశ వాతావరణంలో ఇన్నోవేటర్లను రంగస్థలం మీదకు పిలిచి, వారివారి ఇన్నోవేషన్లను రైతులకు ప్రదర్శనల ద్వారా విశదీకరించటానికి అవకాశం కల్పించారు.

ఇన్నోవేటర్లు మహిపాల్, సుభాని, బాబూరావు ప్రకారం ఇది ఒక ఉత్తమమైన ప్రదర్శన. వీరు ముగ్గురికి రైతులనుండి కొన్ని నెలలలో ఆర్డర్లు రాగలవని నా నమ్మకం. నేను 3–4 పంపిణీదార్లతో పంక్చర్ లేని ట్యూబుల గూర్చి, తులసీ, రిమోట్ల గూర్చి మాట్లాడాను. మిర్యాలగూడ ప్రదర్శన ఐసిఎఆర్ శాస్త్రజ్ఞులు శ్రీ నాయక్ ల్యామ్‌లో నన్ను కలిసి జనవరి – ఫిబ్రవరిలో జరిగే రైతుల ప్రదర్శనకి ఆహ్వానించారు. స్థానిక వార్తాపత్రికలు కూడా పల్లెసృజన ఇన్నోవేషన్లను సుచిత్రంగా ప్రదర్శించాయి.

ఇన్నోవేటర్లు సంతోషిస్తున్నారని భావిస్తాను. ఇన్నోవేటర్లకు సరియైన సౌకర్యాలు, భోజన సదుపాయాలు, వసతి, ప్రయాణ ఖర్చులు, వగైరా అన్నీ సమకూర్చడం జరిగింది. ఇన్నోవేటర్లు భద్రంగా ఇళ్ళు చేరారు. నిర్వాహకులు ఇన్నోవేటర్లకు జ్ఞాపికలు, సర్టిఫికెట్లు ఇచ్చారు. శ్రీ పండరి గారు మొత్తం ప్రదర్శనని సమర్థవంతంగా నిర్వహించారు. వారికి నా తరుపునించి, పల్లెసృజన తరుపునుంచి కృతజ్ఞతలు. మన సభ్యులు రమేష్, కనకరాజు, డ్రైవర్ పురుషోత్తం కూడా పూర్తిగా సహకరించారు. అందరికీ కృతజ్ఞతలు. ఇంతపెద్ద ప్రదర్శనలో పాల్గొనాడానికి నాకు అవకాశమిచ్చిన బ్రిగేడియర్ గారికి నా ప్రత్యేక కృతజ్ఞతలు. **– బి. సుభాష్.**

# 8వ జాతీయ ద్వైవార్షిక పోటీలు
# బహుమతి పొందిన ఇన్నోవేషన్లు - ఇన్నోవేటర్ల వివరాలు




అనువాదం : జె. శశిమోహన్

**జాతీయ మూడవ బహుమతి (వ్యవసాయ ఇంజనీరింగ్) :**

**చెఱుకు కణుపులు నాటే యంత్రం :**

**రోషన్‌లాల్ విశ్వకర్మ, నర్సింగ్‌పూర్, మధ్యప్రదేశ్ :**



పొలాల్లో చెఱుకు కణుపులు నాటడానికి చాలాసమయం పడుతుంది, చాలామంది పనివాళ్ళ అవసరమూ వుంటుంది. కణుపులు సరియైన దూరంలో నాటకపోయినా, వంకట టింకరగా నాటినా, సరియైన లోతులో నాటకపోయినా ఉత్పాదన దెబ్బతింటుంది. దీనిని అధిగమించటానికి మేఖ్ గ్రామానికి చెందిన 47 సంవత్సరాల రోషన్‌లాల్ ట్రాక్టరు ద్వారా కణుపులను నాటే పద్ధతిని కనుగొన్నాడు.

రైతు కుటుంబంలో జన్మించిన రోషన్‌లాల్ మంచి పనిమంతుడుగా, నేర్పుగల టెక్నీషియన్‌గా పేరు తెచ్చుకున్నాడు. తన ఇంట్లోనే వున్న వర్క్‌షాప్‌లో ఎటువంటి వ్యవసాయ యంత్రాన్నయినా రిపేరు చేయగలడు. చిత్ర లేఖనమంటే మక్కువ. ఈయన కుటుంబంలో భార్య, ఇద్దర కొడుకులు, ఇద్దరు కూతుళ్ళు ఉన్నారు. పాఠశాల చదువు అయిపోయిన తర్వాత ప్రభుత్వ కళాశాలలో చేరినా, ముగ్గురు చెల్లెళ్ళ పెళ్ళి చేయాలన్న తలంపుతో తండ్రికి వ్యవసాయంలో సహాయం చేసే ఉద్దేశ్యంతో చదువును మధ్యలోనే ఆపేశాడు. కొత్త వస్తువులను రూపుదిద్దటం చిన్నప్పటినుంచి వున్న అలవాటు. ఈయన 14 యేళ్ల వయసప్పుడు అగ్గిపుల్లలను

కలలు అనేవి నిద్రలో వచ్చేవి కాదు. కలలు అనేవి మీకు నిద్ర లేకుండా చేసేవి.



విరజిమ్మే తుపాకిని కనుగొన్నాడు. దీంతో పంటలను నాశనం చేసే కోతులను తరిమేసేవాడు. 1988లో తన పొలానికి ఒక స్ప్రింక్లర్ కొనుక్కున్నాడు. ఒకరోజు దాని నాజిల్‌ను ఎవరో దొంగిలించారు. చాలా సేపటికి కాని నీరు అక్కడ సరిగ్గా పారటం లేదని అతనికి తెలిసి రాలేదు. ఇలా జరగకుండా ఉండటానికి ఆయన నాజిల్ దెబ్బతిన్నా, లేదా ఏదైనా కారణంచేత వత్తిడి తగ్గిపోయినా వెంటనే ఒక బల్బు వెలగడం ద్వారా ఇతనికి తెలిసేలా ఒక పద్ధతిని ఏర్పాటు చేసుకున్నాడు.

అదే సంవత్సరంలో ఆ విషయంమీదనే పరిశోధన చేసి, ఒక తేలికైన కప్లర్ తయారు చేశాడు. కాని, మేథో సంపత్తి రక్షణ చట్టం (ఐపిఆర్) గురించి తెలియక ఒక పెద్ద కంపెనీకి ఈ విషయం తెలియజేశాడు. వారు ఇతనికి ఏమీ చెల్లించకుండానే కప్లర్‌ని ఆ సంస్థ ఉత్పత్తి చేయటం ప్రారంభించింది. ఇవే కాక, కొత్త రకమైన చెక్క నాగలి, మన్నిక గల ఇనుప నాగలి, కందులు, వేరుశనగ, బార్లీ, సోయాబీన్, బఠాని గింజలపైనున్న పొట్టును వలిచి, పొట్టును, గింజలను వేరు చేసే యంత్రం, నీటి పంపులకి ఆటోమేటిక్ స్టార్టర్, ప్రయాణాలలో వినియోగించేందుకు చిన్న ఇస్త్రీపెట్టె, స్ప్రింక్లర్‌తో ఎరువులు, క్రిమి సంహారక మందులను వెదజల్లే పద్ధతి, ఆయిల్ ఇంజన్ వేడెక్కకుండా నియంత్రించే పరికరం, విద్యుత్ దొంగిలించడాన్ని తెలియజేసేందుకు అలారం మోగే పద్ధతిలాంటివెన్నింటినో కనుగొన్నాడు.

2006లో చెఱుకు తోటల్లో వాడుకోవటానికి మూడు యంత్రాలను కనుగొన్నాడు. చెఱుకు ఆకులను సులభంగా తొలగించే కొడవలి, సెట్ కట్టర్ మరియు బడ్ చిప్పర్ (చెఱుకు కణుపులను కత్తిరించే పరికరం)లను కనుగొన్నాడు. ఈ చివరి దానికి 2009లో 5వ జాతీయ ద్వైవార్షిక పోటీలలో ప్రోత్సాహక బహుమతి కూడా పొందాడు. దీనిని టాటా అగ్రి కో. వారు మార్కెటింగ్‌కు ముందుకు వచ్చారు. 2008లో పంట పొలాల్లో క్రిమి సంహారక మందులను స్ప్రే చేయటానికి మనిషి తోసుకుంటూ నడిపేలా ఒక పరికరాన్ని తయారు చేశాడు. దీనిలో స్ప్రే చేయవలసిన మందును పంటను బట్టి మార్చుకునే వీలున్న 8 నాజిళ్ళు, 4 మీటర్ల దూరం వరకు మందును వెదజల్లుతుంది.

తనవద్ద చెఱుకు కణుపులను కత్తిరించే యంత్రం కొన్నవారు వాటిని మనుషులను పెట్టి నాటించడానికి చాలా సమయము, ధనాన్ని వెచ్చించాల్సి వస్తుందని గమనించాడు. దీనిపై పరిశోధనలు జరిపి చెఱుకు కణుపులను సరియైన దూరంలో, ఒకే వరుసలో సరియైన లోతులో నాటేలా ఒక పరికరాన్ని రూపొందించాడు. తర్వాత దానిని ట్రాక్టర్‌తో అనుసంధానం చేసి, ట్రాక్టరు ద్వారా కణుపులను నాటే ప్రక్రియను చేపట్టాడు. దీనివల్ల రైతుకు ఎకరాకు 6 వేల



**జీవితము - కాలము ప్రపంచంలో ఉత్తమమైన గురువులు.**
**జీవితం కాలాన్ని ఎలా సద్వినియోగం చెయ్యాలో చెప్తుంది. కాలం జీవితంలోని విలువలను నేర్పుతుంది.**

రూపాయల దాకా అయ్యే ఖర్చును 8 వందల రూపాయలకు తగ్గించాడు. కేవలం 2 గంటల్లో ఒక ఎకరం పొలంలో కణుపులను నాటవచ్చు. అదే సమయంలో ఈ పద్ధతిలోనే ఎరువులు, క్రిమి సంహారక మందులను కూడా ఒక స్ప్రేయర్ పంపు ద్వారా అందించే ఏర్పాటు కూడా చేశాడు. ఈ యంత్రాన్ని ఉపయోగించుకుని చెఱకు తోటలో అంతర పంటలుగా వేరుశనగ, పప్పు ధాన్యాలు, గోధుమలను కూడా వేసుకోవచ్చు. ఆలుగడ్డ నాటడానికి కూడా ఇది పని చేస్తుంది. ఈ యంత్రంలో ఏర్పాటు చేసిన డ్రమ్ములలో ఎరువులు, క్రిమి సంహారక మందు, విత్తనాలు (కణుపులు) నింపడానికి మాత్రమే ఒక మనిషి అవసరమౌతాడు.

**జాతీయ మూడవ బహుమతి (ఇంజనీరింగ్) :**

**ఇటుకలు తయారు చేసే యంత్రం :**

**కె. చంద్రశేఖర్, గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్ :**

53 సంవత్సరాల వయసుగల కె. చంద్రశేఖర్ తన గ్రామంలోనే బాల్యం నుండి ఇటుకలు తయారు చేసే పరిశ్రమలో పనిచేసే శ్రామికుడు. అందుకే తన అనుభవంతో ఎటువంటి ఇంధనం అవసరం లేకుండా కేవలం మానవ శక్తితో పనిచేసే ఒక వినూత్న ఇటుక తయారీ యంత్రాన్ని తయారు చేశాడు.



నేపథ్యం :

చంద్రశేఖర్ ఒక సామాన్య రైతు కుటుంబంలో జన్మించాడు. అతడు మూడవ తరగతిలో వుండగా క్షయ వ్యాధి సోకడంతో చదువు మానవలసి వచ్చింది. కుటుంబం ఆర్థిక ఇబ్బందుల కారణంగా చదువు మానివేసి కూలిపనికి వెళ్ళాల్సి వచ్చింది. ఆ క్రమంలో అతడు పొలం పని, సామాన్లు మోయటమే కాకుండా, ఎక్కువ కాలం ఇటుకల తయారీ పరిశ్రమలో పని చేశాడు. ఆర్థిక ఆటుపోట్లు వున్నప్పటికీ ఎల్లప్పుడూ అతడు వినూత్న పంథాలో, సృజనాత్మకంగా ఆలోచించేవాడు. ఆ క్రమంలోనే అతతడు మానవ నిర్దేశిత చెరుకు గానుకని, నూనె తయారీ యంత్రాన్ని కనుగొన్నాడు. చంద్రశేఖర్‌కు భార్య ముగ్గురు సంతానం.

మూలం :

ఇటుక పరిశ్రమలో పనులని స్త్రీ పురుషులకు వేరువేరుగా కేటాయిస్తారు. ముడిసరుకును మగవారు తీసుకు వస్తే స్త్రీలు ఒక రాతిపై కూర్చును ఇటుకలను తయారు చేస్తారు. స్త్రీలు ఇబ్బందికరమైన రీతిలో ముందుకు వంగి ఇటుకలు తయారు చేయాల్సి వుండటం వల్ల వారి శరీర భాగాలు బహిర్గతం కావటం సహజం. ఇటువంటి పరిస్థితులలో అక్కడ పనిచేసే పురుషుల చేతిలో మానసిక వేధింపులకి గురి కావటం గమనించిన చంద్రశేఖర్ మనిషి కూర్చుని పని చేయాల్సిన అవసరం లేకుండా ఒక యంత్రాన్ని తయారు చేసి ఇటువంటి ఇబ్బందులను తొలగించాలని నిశ్చయించుకున్నాడు. ఈ యంత్రం విద్యుత్, ఇతర ఎటువంటి ఇంధనం అవసరం లేకుండా తయారు చేశాడు. ప్రస్తుతమున్న కరెంటు కోతల పరిస్థితుల్లో విద్యుత్‌పై ఆధారపడి పనిచేసే యంత్రం వల్ల ఎటువంటి ఉపయోగం ఉండేది కాదు.

తాను ఈ యంత్రం తయారు చేసిన మొదట్లో తోటి శ్రామికులతో కాని, యజమానులతో గాని ఎటువంటి ఆదరణ లభించలేదని దిగులు పడుతున్న సమయంలో అతని కుటుంమ సభ్యులు ఈ కొత్త యంత్రం ప్రాముఖ్యతని గ్రహించి ప్రోత్సహించడం మొదలు పెట్టారు. కానీ యీ సమాజం నుండి లభించని ప్రోత్సాహం గురించి చంద్రశేఖర్



**అపజయం అనే రోగాన్ని చంపే ఉత్తమమైన ఔషధం నమ్మకం మరియు శ్రమించి పని చేయటం.**

తన నిరాశను వ్యక్తం చేస్తూ వుంటాడు. వారందరూ ఈ యంత్రం తయారీ కన్నా ఆదాయం వచ్చే పనులు చేసుకొమ్మని సలహాలు ఇచ్చేవారు. యంత్రం తయారు చేసిన తర్వాత కూడా ప్రజలు ఒక శ్రామికుడు తనపని చేసుకోకుండా శాస్త్రజ్ఞుడవటానికి ఎందుకు ప్రయత్నిస్తున్నాడని భావించేవారు. ఎవరివద్దనుండి ఎలాంటి ఆర్థిక సహాయం లేకుండా అతను తనకున్న యంత్రం నమూనాని తయారు చేశాడు. ఇక్కడ అతనికి చాలా అనుభవం ఎదురైంది. అతను తయారు చేసిన నమూనా యంత్రాన్ని ఎవరో దొంగిలించారుఅ. దీని తయారీలో తనకున్న వనరులన్నీ పెట్టేసిన కారణంగా అసలే ఆర్థిక ఇబ్బందుల్లో వున్న ఇతనికి వేరొక నమూనా చేయడం కుదరలేదు.. ఈ సమయంలో 'పల్లెసృజన' ముందుకు వచ్చి ఎన్.ఐ.ఎఫ్. ద్వారా వేరొక నమూనా చేయడానికి సహకారం అందించిందని తన కృతజ్ఞతను తెలియజేస్తాడు.

ఇటుక తయారీ యంత్రం :

మానవ శక్తితో నడిచే ఈ యంత్రంలో ఇటుకల మౌల్డింగ్‌పై మట్టి, ఇసుక కలిపిన మిశ్రమాన్ని వేయటం, దానిపై వున్న అదనపు మన్ను తొలగించటం, పైనుండి ఇటుకల మౌల్డింగ్‌పై వత్తిడి చెయ్యటం ద్వారా ఒకేసారి 50 ఇటుకలు తయారు కావటంతో ఉత్పాదక శక్తి పెరుగుతుంది.

ఈ యంత్రంతో ఇబ్బందికరంగా కూర్చుని పని చేయాల్సిన అవసరం లేదు మనిషి నిలబడే దీనిని వాడటం ద్వారా ఇటుకల తయారీలో శారీరక శ్రమ తగ్గడమే కాకు ఉత్పాదకత మూడింతలలు పెరుగుతుంది. ఈ యంత్రం తయారు కాకముందు 10–15 ఇటుకల తయారీకి పట్టే సమయంలో 50 ఇటుకలను తయారు చేయవచ్చు. పాత పద్ధతిలో ఆరుమంది వ్యక్తులు 8 గంటల పాటు పని చేస్తే 1500 ఇటుకలు తయారు చేస్తారు. ఇందుకు 1000 నుండి 1500 రూపాయల ఆదాయం పొందేవారు. ఈ యంత్రం తయారైన తర్వాత అదే సమయంలో 4 నుండి 5 వేల రూపాయలు సంపాదించ గలుగుతున్నారు. దీనివల్ల లభించే మరో సాంఘిక ప్రయోజనం ఏమిటంటే దీన్ని బాల కార్మికులతో పని చేయించలేము. కాబట్టి ఇటుకల తయారీలో బాల కార్మికుల ఏర్పాటు లేకుండా పోయింది.

మొదటి నమూనా యంత్రం బరువు 300 కిలోలు వుంటే రెండవ నమూనాతో తయారు చేసిన యంత్రం బరువు అనేక ప్రయోగాల తర్వాత 130 కిలోలకి తగ్గించగలిగాడు. చంద్రశేఖర్ దీన్ని ఇంకా తగ్గించడానికి అనేక ప్రయత్నాలు చేస్తున్నాడు. ఎక్కువ సామర్థ్యం, తక్కువ బరువు గల యంత్రాల తయారీతో తరతరాల జీవనోపాధిని సమాజానికి అందించ వచ్చు.

**జాతీయ మూడవ బహుమతి (శక్తి) :**

**వేడిమి (బట్టి)తో 'కోవా' తయారు చేసే ఆధునీకరించిన యంత్రం :**

**సుభాష్ ఓలా, అల్వార్, రాజస్థాన్ :**



కోవా చాలా తీపి పదార్థాలలో ముఖ్యమైన ముడి పదార్థం. దీనినే 'పిక్క కోవా' అని కూడా అంటారు. దాదాపు అన్ని మిఠాయిల తయారీలో ఈ పిక్క కోవా తప్పనిసరి పాల ఉత్పత్తి పదార్థం. సాంప్రదాయక పద్ధతిలో పాలను బాగా మరగబెట్టి ఘనీభవించేలా చేసి కోవా తయారు చేస్తారు. 35 సంవత్సరాల సుభాష్ ఓలా సాంప్రదాయ కోవా తయారీ యంత్ర బాయిలర్ (బట్టి)ని ఆధునీకరించాడు.

**నేపథ్యం :**

అల్వార్‌లో రైతు కుటుంబానికి చెందిన సుభాష్‌కి ముగ్గురు సహోదరులు. చదువులో మన్నగా వున్నప్పటికీ తన తండ్రికి ఆర్థికంగా సహాయం చేయడానికి చదువు మానేశాడు. ఇతని తండ్రి వ్యవసాయమే కాక బోర్ బావులను కూడా త్రవ్వేవాడు. సుభాష్ మొదట్లో బోరు బావులు తవ్వేవాడు. తర్వాత వ్యవసాయం, తదుపరి కంప్యూటర్ భాగాలు అమర్చడం చేసేవాడు. చిన్న ప్రాయంలోనే వివాహమైంది. ఇతనికి పాఠశాలలో చదువుకునే ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నాడు.

చిరుప్రాయంలోనే వాహనాల సైలెన్సర్ నుండి వచ్చే వేడిగాలి ఇతరత్రా ఏవిధంగా ఉపయోగపడవచ్చని

నీవు క్రితంసారి చేసిన తప్పే నీకు మంచి పాఠం నేర్పుతుంది.



యోచించేవాడు. ఆవిరి ఆధారిత సాంకేతికతపై ఇతనికి ఎంతో ఆసక్తి వుండేది. ఎనిమిదవ తరగతిలో వున్నపుడే అర కిలో వాట్ గల ఆవిరిని పునరావృతం చేయగల ఒక చిన్న పరికరాన్ని తయారు చేశాడు. ఇది 6 వాట్ల బల్బును వెలిగించ గలిగింది. కాలానుగుణంగా ఇతనికి ఆవిరి సాంకేతికతపై ఆసక్తి పెరుగుతూ వచ్చి ఇందులో పరిశోధనలు చేయడం ప్రారంభించాడు. 2000 సంవత్సరంలో ఇతను 2 కిలో వాట్ల ఆధునిక ఇంజన్ని తయారు చేశాడు. 2013లో ఆవిరి ఇంజన్ నుండి వెలువడే ఆవిరిని ఆదా చేయగలిగేలా ఒక సమర్థవంతమైన 'వేడి మార్పిడి' సాధనాన్ని తయారు చేశాడు.

**మూలం :**

సాంప్రదాయ కోవా ను పెద్ద కుంపటిపై బాయిలి పెట్టి, కట్టెలు మండించి తయారు చేస్తారు. వ్యాపారాత్మ కంగా పాలను కాచడానికి ఆవిరిని ఉపయోగించడం జరుగుతోంది. క్రింద మంటను పెట్టి వేడి చేయటానికి బదులు బాయిలర్లో (బట్టిలో) కట్టెలను మండించి తద్వారా వెలువడే ఆవిరిని బాయిలర్ లోకి పంపే ప్రక్రియతో పంపుతారు. పాలు మరిగిన తర్వాత, బయటకు వచ్చే ఆవిరిని బైటవున్న తొట్లలోకి పంపిస్తారు. ఈ స్టీమ్ పైపుల అతుకులు (జాయింట్లు) సరిగ్గా వుండని కారణంగా ఆవిరి వృధాగా బయటకు వెళ్తుంది. దీనితో ఎక్కువ ఆవిరి ఖర్చు, ఎక్కువ వంటచెరుకు ఖర్చు, ఎక్కువ నీరు కూడా అవసరం. వీటన్నిటిమూలంగా ఈ పద్ధతిలో ఖర్చు ఎక్కువవుతుంది, సామర్థ్యం దెబ్బతింటోంది. ఇందులో వాడే నీరు కూడా సాధారణ నీరే కావున బట్టిలలో పొరలు ఏర్పడి పనితనం ఇంకా తగ్గుతుంది.

సుభాష్, జయ్పూర్లో ఒక పరిశ్రమలో బట్టి ఆధారిత కోవా తయారీ యంత్రాన్ని చూశాడు. ఆరోజుల్లో అతను బట్టీలను సమర్థవంతంగా చేయడానికి ప్రయత్నం చేస్తున్నాడు. ఆ పరిశ్రమలో పనిచేస్తున్న వారితో సంభాషించిన తర్వాత కోవా తయారీకి ఖర్చయ్యే వంట చెరుకు, నీళ్ళు గూర్చి కలత చెందాడు. 100 లీటర్ల పాలు వేడి చేసి కోవ తయారు చేయటానికి 100 కిలోల వంటచెరుకు, 4000 లీటర్ల నీరు అవసరమౌతాయి. ఇంతేకాక వదిలివేసిన ఆవిరి చల్లబరచటానికి నడిపే పంప్కు ఖర్చయ్యే విద్యుత్తో కూడా వ్యయం ఎంతో ఎక్కువగా ఉంటుంది.

ఇతడు ఈ ప్రక్రియలో సామర్థ్యం సాధించటానికి పదేళ్ళు కృషి చేసి, చివరికి 2009వ సంవత్సరంలో కోవా తయారీ బట్టీని తయారు చేశాడు. వాడిన ఆవిరిని తిరిగి నీళ్ళతో కలిపి బాయిలర్కు పంపబడతాయి. ఆవిరి పైపులు చాలా తగ్గినందున లీకేజీలు వుండవు. నీటి అవసరం తగ్గుతుంది. (గంటకు 1000 లీటర్ల స్థానంలో కొన్ని లీటర్లు మాత్రమే అవసరం). బాయిలర్ సమానాంతర ట్యూబుల వాడకం, లోపలికి పంపే గాలిని వేడి చేయటం, ఆవిరిని సాపేక్షీకరణం చేయకుండా బాయిలర్లోకి పంపడం అన్నీ



మీ సంతకం ఎప్పుడు మీ ఆటోగ్రాఫ్గా మారుతుందో, అప్పుడే మీ జీవితం సార్థకమైనట్లు.

నీటి అవసరాలన్నీ, విద్యుత్ ఖర్చును చాలా తగ్గిస్తాయి. ఈ ప్రక్రియలో బాయిలర్‌లోని నీటిని ఎక్కువసేపు వాడవచ్చు. ప్రతి అరగంటకు నీటిని నింపే అవసరం వుండదు.

ఇంతే కాకుండా పని తగ్గించడానికి పాలని కలియబెట్టే ప్రక్రియ కూడా స్వతహాగా జరిగిపోతుంది. సాంప్రదాయిక పద్ధతిలో పాలని బాలె అంచులకి అతుక్కోకుండా నిరంతరం తిప్పుతునే వుండాలి. ఇందుకు ఒక బాలె వద్ద ఒక మనిషి అవసరం వుంటుంది. సుభాష్ తయారు చేసిన యంత్రంలో 10–12 లీటర్ల పాలు ఒక్కసారే యాంత్రికంగా కలియబెట్ట బడటమే కాక తయారైన కోవాగా మళ్ళించబడుతుంది. దీనికి కావలసిన వేడిమి వంట చెరుకులో ఉత్పన్నమై మూసివున్న అడ్డ ట్యూబులు కల బాయిలర్ (బట్టి) నుండి సరఫరా చేయబడుతుంది. బట్టిలో కొలిమి తిత్తి (బ్లోయర్) లోకి వాయువుల ద్వారా వేడెక్కిన గాలి పంపబడుతుంది. దీనిని ఒత్తిడితో చలించే స్విచ్‌కి కలుపుతారు. స్వయం సిద్ధంగా నడుస్తున్న బట్టి, యంత్రం కారణంగా శ్రమకు అయ్యే ఖర్చు తగ్గడమే కాకు,డా ఒక యూనిట్ 'కోవ'కి ఖర్చయ్యే వంట చెఱకు కూడా తగ్గుతుంది. ఈ సాంకేతిక పరిజ్ఞానం పాల ఉత్పత్తి కేంద్రాలలో, ఆహార పదార్థాల ప్రాసెసింగ్ పరిశ్రమలలోను, నేత పరిశ్రమలోను, ప్లాస్టిక్ తయారీలోను వాడి ఉత్పత్తి పెంచవచ్చు.

సుభాష్ గంటకి 40 లీటర్ల నుండి 3000 లీటర్ల సామర్థ్యం గల (వీటి వెల రూ. 60 వేల నుండి లక్ష వరకు) యంత్రాలను వినియోగదారుల అవసరాల మేరకి తయారు చేస్తున్నాడు. ఉత్తర భారతదేశంలోని వివిధ ప్రాంతాలలో 60 యంత్రాల దాకా అమ్మగలిగాడు.

ఈ సృజనాత్మక కార్యక్రమంలో ఇతని తండ్రిగారు ఇది అనవసరమైన ఖర్చని భావించి విముఖత చూపించి నప్పటికీ ఇతని తల్లి పూర్తిగా సహకారాన్ని అందజేశారు. ఉమ్మడి కుటుంబంలో వుంటున్న కారణంగా ఇతని సంపాదనే ప్రాథమికం కాకపోవటంతో కొంత వెసులుబాటు లభించింది. ఒకరిద్దరు ఇతర కుటుంబ సభ్యులు దీనికి పేటెంట్ హక్కులు సాధించటంలోను, తద్వారా ఆదాయం సమకూర్చుకోవటంలోను సాయ పడ్డారు.

**జాతీయ మూడవ బహుమతి (మొక్కలలో రకాలు) :**

**పున్నాథనం జాతి - జాజికాయలో ఉన్నతమైన రకం :**



**వర్కీ థమ్మన్, ఇదుర్కి, కేరళ :**

కేరళలో ఇదుక్కి జిల్లాకి చెందిన 76 యేళ్ళ వర్కీ థమ్మన్ అనే అభ్యుదయ రైతు ప్రాంతీయ జాతుల నుండి ఒక పెద్ద రకం 'జాజికాయ' ఉత్పత్తికి నాంది పలికాడు.

**నేపథ్యం :**

ఏడుగురు సహోదరులలో చిన్నవాడైన వర్కీ కొట్టాయం జిల్లాలో రైతు కుటుంబానికి చెందినవాడు. 7వ తరగతి దాకా చదివాడు. 14 సం. ప్రాయంలో ఇతని కుటుంబం ఇదుక్కికి వలస పోయింది. వారు వెళ్ళిన ప్రాంతం విద్యుత్తు, రహదారులు, ఇతర సదుపాయాలు లేని అటవీ ప్రాంతం. 1970లో వీరికి ప్రభుత్వం నుండి భూమిపై హక్కులు లభి,చాయి. చిన్న వయసులోనే తండ్రికి, సోదరులకు సాయం చేయడానికి పనిలో చేరాడు. వారు అడవిలో కొంత భూమిని సాగుచేసి అరటి, పెండలం, వరి వంటి పంటలు సాగు చేయటం ప్రారంభించారు. రెండు సంవత్సరాల తర్వాత వారు వరి బదులు వక్కలు, కొబ్బరి, మిరియాలు మొదలైన వాటిని పండించటం ప్రారంభించారు. ఆరోజుల్లో వారు కరిముంద జాతి మిరియాలను పెద్దయెత్తున పండించేవారు. అప్పుడే 'జాజికాయ' మొక్కలను కొన్నింటిని తెచ్చి తమ పొలంలో నాటి కాపు ఎలా వస్తుందో ఓసారి పరీక్షిద్దామనుకున్నారు. అవి మంచి దిగుబడిని ఇవ్వటంతో జాజికాయ నాటడానికి కొంత భూమిని కేటాయించారు. ప్రారంభ దశలో జాజికాయలో ఉన్నత జాతులను అభివృద్ధి పరచటానికి గుజ్జుని వాడేవారు. కొంత అనుభవం సంపాదించాక వారికి 1960 నాటికి స్వంతంగా సాగు చేసుకోవటమే కాక, వివాహం కూడా చేసుకుని జీవితంలో తాను స్థిరపడుతూ తన సోదరులను కూడా పరిసర ప్రాంతాల్లోనే స్థిరపరిచాడు.

**నేను 'హ్యాండ్‌సమ్'గా వుండే వ్యక్తిని కాదు కానీ, అవసరమున్న 'సమ్' పీపుల్‌కి నా 'హ్యాండ్' ఇవ్వగలను.**



**మూలం :**

ఇరవై ఏళ్ల క్రితం వారి తాతగారి ఊరినుండి తెచ్చిన ఒక ప్రాంతీయ జాజికాయ జాతి నుండి పున్నాథనమ్ జాజికాయను తయారు చేయడం మొదలు పెట్టాడు. ఇది అనేక సంవత్సరాల ప్రయోగాల పరిశీలన ఫలితం. జాజికాయ గుజ్జుతో అనేక రకమైన పరిశోధనల తర్వాత ఇది సాధించాడు. ప్రస్తుతం ఇతనికి 120-125 జాజికాయ మొక్కలు దిగుబడినిస్తూ వుంటాయి.

**జాజికాయ రకం :**

'పున్నాథనమ్' జాతి జాజికాయ 1994లో ప్రాంతీయ జాతుల జాజికాయలను అంటు తొక్కడంతో ఉద్భవించిన ఒక చాలా పెద్ద జాజికాయ రకము. ఈరకం జాజికాయలు 4.5 సెం.మీ. పొడవు 3 సెం.మీ. వెడలల్పు వుంటాయి. బాగా ఎదిగిన పున్నధానమ్ జాతి ఒక చెట్టు సంవత్సరానికి దాదాపు 3000 కాయల వరకు దిగుబడిని ఇస్తుంది. ఇవి పచ్చివైన 50 జాజికాయలు 1 కి.గ్రా. బరువుంటే అవే ఎండిన తర్వాత 250 కాయలు 1 కి.గ్రా. బరువుంటాయి. అయితే ఈ రకం జాజికాయలు మిగిలిన వాటిలాగా కాకుండా తక్కువగా విరిగిపోతాయి. అంతేకాక పురుగులు పట్టవు, సహజంగా అధిక దిగుబడినిచ్చే వీటి నిర్వహణా భారంకూడా తక్కువ. ఈ జాజికాయల ప్రత్యేకత పెద్ద పరిమాణాన్ని కలిగి వుండటం, అధిక దిగుబడి రావటం, పూర్తిగా కప్పబడిన ఎర్రటి గుజ్జు పదార్థాన్ని కలిగి వుండటం, కీటకాలు, తెగుళ్ళను తట్టుకునే స్వభావం కలిగి వుంటాయి. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్పైస్ రీసర్చ్, కలకత్తా, కేరళ వారితో పాటు ఇదుక్కిలోని కృషి విజ్ఞాన కేంద్రం వారు కూడా దీన్ని ధృవీకరించారు. ఇది పొదవుగా పెరుగుతుంది. ఈ రకాన్ని ఇప్పటికే ఎర్నాకులం, కొట్టాయం, త్రివేంద్రం జిల్లాల్లో 500 మొక్కలకు పైగా అమ్మటం జరిగింది.

వర్కీ థమ్మన్‌కు మూడేళ్ళ క్రితం 'పున్నాథనమ్' జాతి మొక్కల చిన్న తోట వుండేది. గుజ్జు నుండి తయారైన నారులో ఆడ, మొగ మొక్కలుండేవి. వీటితో అతను తన ప్రత్యేక నైపుణ్యంతో కేవం మొక్కను చూడగానే మొక్క ఆడదిగా గుర్తించి, వాటిని అమ్మేవాడు. ఆ ప్రాంతంలో గుజ్జునుండి వచ్చిన నారుని అమ్మే ఒకేవొక రైతును నేను మాత్రమే అంటాడు వర్కీ థమ్మన్. మొగ్గల నుండి కాకుండా గుజ్జునుండి వచ్చే నారు అధిక ఉత్పత్తితో పాటు 90 సంవత్సరాల వరకు జీవిస్తాయని అతని అభిప్రాయం.

ఇతను జాజికాయనే కాకుండా మిరియాలు, కోకో, ఏలకులు కూడా పండిస్తాడు. తన పంటలకు పూర్తి సేంద్రియ

## NIF లో మీకు అవసరమైన ఇన్నోవేషన్‌ల అన్వేషణ

నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ గత 14 యేళ్ళుగా సేకరించిన గ్రామీణ ఇన్నోవేషన్లు, సాంప్రదాయ జ్ఞానం ప్రజలందరికీ అందుబాటులో వుండటానికై ఒక వెబ్‌సైట్ తయారు చేసింది. ఈ జ్ఞానమంతా వెబ్‌సైట్ www.nifindia. org లో చూడవచ్చు. అలాగే మీకు ఏ సమస్యకైనా పరిష్కారం ఈ జ్ఞానం కోశంలో వుందో లేదో తెలుసుకోవాలనుకుంటే

**NIF టోల్ ఫ్రీ నెంబర్ 1800 233 5555**

కు కూడా ఫోన్ చేసి తెలుసుకోవచ్చు.

కానీ ఫోన్‌లో మాట్లాడాలనుకునేవారు ఇంగ్లీషు లేదా హిందీలో మాత్రమే సంప్రదించవలసి వుంటుంది.

**కష్టాల సారాంశమే విజయం.**

విధానాలతో పండిస్తాడు. జీవామృతం ఎక్కువగా వినియోగిస్తాడు. 70 సం.ల వయస్సులో కూడా ఇప్పటికీ వర్క్ తన పొలం పనులలో పూర్తిగా నిమగ్నుడై వుంటూ రైతుగా గర్వపడతాడు. వ్యవసాయానికి అతను చేసిన సేవలకు ఎన్నో ప్రశంసలను కూడా అందుకున్నాడు. అతను చేసిన కృషికి ప్రాంతీయ పత్రికలు బాగా ప్రాచుర్యాన్ని కల్పించాయి.

**జాతీయ మూడవ బహుమతి (మానవ ఆరోగ్యం) :**

**మధుమేహానికి మూలికల మందు :**

**భికిబెన్ ప్రహ్లాద్ భాయ్ బజానియా (సమూహ ప్రతినిధి), అహమ్మదాబాద్, గుజరాత్ :**



మధుమేహం అనదేరి రక్తంలో గ్లూకోజ్ (చక్కెర) శాతం సాధారణ స్థాయికన్నా ఎక్కువగా వుండే పరిస్థితి. 2013లో జరిపిన మధుమేహపు అట్లాస్ ప్రకారం ప్రపంచ దేశాలన్నింటిలో మధుమేహ వ్యాధిగ్రస్తుల సంఖ్యలో భారతదేశం రెండవ స్థానంలో వుంది. ఈ వ్యాధి నివారణకి బికిబెన్ ప్రహ్లాద్ భాయి బజానియా (47 యేళ్ళు) ఔషధాన్ని తయారు చేసింది.

భికిబెన్ ఒక సామాన్య గృహస్తురాలు. ఆవిడ ఇంటి పనులతో పాటు భర్తకి వ్యవసాయంలో సహాయం చేస్తూవుండేది. అంతేకాక ఆవిడ స్థానిక అంగన్‌వాడిలో పని చేస్తూ వుండేది. ఆవిడ భర్తకి 6 ఎకరాల పొలం వుండేది. వారికి ఇద్దరు కుమారులు, ముగ్గురు కుమార్తెలు. వారి పిల్లలందరికి వివాహాలు అయినాయి. కనిష్ట కుమారుడు 10వ తరగతి చదువుతున్నాడు. భికి బెహన్‌కి ఇతరులకు సహాయం చేయటంలో, సమాజ సేవలో ఆసక్తి ఎంతో వుంది. ఇందులో ఆవిడ భర్త సహకారం పూర్తిగా వుండేది.

పది సంవత్సరాల క్రితం ఆవిడకి మధుమేహం బయట పడింది. భికి బెహన్ ఇది నయం కాని వ్యాధి అని ఎవరో చెప్పిన మాటలతో చాలా భయపడింది. కుటుంబ సభ్యులు ఆమెను అలోపతి మందులు వాడమని సలహా ఇచ్చినప్పటికి దానివలన వచ్చే ఇతర ఆరోగ్య సమస్యలతో ఆమె దిగులు పడింది. ప్రత్యామ్నాయ మందులు వాడటానికి నిర్ణయించుకుంది. కుటుంబ సభ్యులతో సంప్రదిస్తున్నప్పుడు ఆమె అత్త కీ.శే. శివిబెనణ కర్సేన్ భాయి బజానియా వాడిన మూలికల గూర్చి తెలుసుకుంది. ఈ మందు వున్నదని తెలిసినప్పటికీ అది ఎంతబాగా పని చేసిందన్న విషయాన్ని గురించి ఎవ్వరూ చెప్పలేకపోయారు. కుటుంబ సభ్యులు వారించినప్పటికీ బికీబెన్ ఈ మందు వాడటానికే నిర్ణయించుకుంది.

ఈ మూలికలు వాడటంతో నెల రోజులలో ఆరోగ్యస్థితి బాగుపడటాన్ని ఆమె గమనించింది. దాంతో అదే వాడటం కనసాగించింది. తన వ్యాధిని నియంత్రించుకో గలిగింది. ఇక దీనితో ఆవిడ ఈ మందును ఇతరులకు కూడా ఇవ్వడం మొదలు పెట్టింది. అలా చాలామంది లబ్ది పొందారు.

మధుమేహ వ్యాధిగ్రస్తులకు శరీరం కావలసినంత 'ఇన్సులిన్' ను ఉత్పత్తి చేయలేదు లేదా సక్రమంగా వాడుకోలేదు. దీంతో చక్కెర శాతం పెరిగి మధుమేహ లక్షణాలైన అతిమూత్రం, విపరీతమైన దాహం, బరువు కోల్పోవడం లాంటివి జరుగుతూ వుంటాయి.

వారి వారి ఆరోగ్యస్థితిని బట్టి భికి బెహన్ 25-100 గ్రా. స్థానిక మూలికల (సాంకేతిక కారణాల వల్ల మూలికల పేర్లు చెప్పలేము)ను నీళ్ళలో కలిపి మొదట నెలరోజుల పాటు ఇస్తుంది. ఎన్.ఐ.ఎఫ్. మధుమేహాన్ని నియంత్రించే ఈ మూలికల మందుయొక్క పనితనాన్ని చూసి అహమ్మదాబాద్ లోని 'బి.వి. పటేల్ ఫర్మాస్యూటికల్ ఎడ్యుకేషన్ & రీసర్చ్ డెవలప్‌మెంట్' వారు సన్మానించారు. ఇది వాడిన జంతువులలో రక్తంలో గ్లూకోజ్ శాతం నియంత్రింపబడి వున్నట్లు తెలిసింది. వాడటంతో భౌతికంగా కానీ, నడవడిలో కాని, రసాయనికంగా గానీ ఎటువంటి మార్పులు లేని కారణంగా ఈ మందు హానికరం కాదని తేలింది. దీనిపై అవసరమైన నిబంధనలు పాటించిన తర్వాత అదనపు పరిశోధనలు జరగడానికి అవకాశాలున్నాయి. **(సశేషం)**

**పైదాకా ఎక్కటానికి శక్తి కావాలి. అది హిమాలయాలైనా సరే, నీ వృత్తిలోనైనా సరే.**

# పశ్చిమ గోదావరి జిల్లా సాంప్రదాయ జ్ఞానం

**సాంప్రదాయ వైద్యం అందించినవారు :**

**చాపర్ల రామారావు,** పశ్చిమ గోదావరి జిల్లా, ప్రగడపల్లి నివాసి. ఫోన్ : 96034 30482

67 సంవత్సరాల రామారావు గారు జీవితంలో ఎన్నో ఒడిదుడుకులు చూశారు. హైదరాబాదులో 7 సంవత్సరాలు గడిపారు. గత 17 సంవత్సరాలుగా మూలికా వైద్యాన్ని ప్రజలకు అందిస్తూ ఎన్నో వ్యాధులను నివారించి చాలామందికి ఉపశమనం కలిగించారు. ఆయన ప్రధానంగా క్యాన్సర్, మధుమేహం, పచ్చకామెర్లు, రక్తపోటు, మూలశంక లాంటి వ్యాధులను చాలా విశ్వాసంతో తగ్గించ గలనని 'పల్లెసృజన'కు తెలియజేశారు. ఆయన మనుషుల వ్యాధులకు, పశువుల వ్యాధులకు సంబంధించి వివరించిన కొన్ని సాంప్రదాయ వైద్య పద్ధతులను ఈ క్రింద తెలియజేస్తున్నాము.

**✷ ఆరోగ్యంగా, శక్తివంతంగా ఉండాలంటే :**

మనిషి ఆరోగ్యంగా, శక్తివంతంగా ఉండాలంటే 100 గ్రాముల వేరుశనగపప్పు, 50 గ్రా. మంచి బెల్లం తిని, ఒక గ్లాసు పాలు త్రాగి పడుకోవాలి. రాత్రి భోజనం మానేయాలి. ఉదయం లేస్తూనే ఆరోగ్యంగా, శక్తివంతంగా ఉంటారు, మలమూత్రాలు కూడా సవ్యంగా జరుగుతాయి అని అంటున్నారు.

**✷ పచ్చకామెర్లకు :**

పచ్చకామెర్ల వ్యాధి ఎంత సాధారణంగా కనిపించినా, ఒక్కోసారి అది ప్రాణాంతకంగా కూడా మారిన సందర్భాలు ఎన్నో వున్నాయి. ఈ వ్యాధి ముఖ్యంగా 'లివర్' పైన ఎక్కువ ప్రభావం చూపిస్తుంది. దీని నివారణకు నాగ తొండాకు రసం (20 మి.లీ.), ఆవు పాలలో (50 మి.లీ.) కలిపి రోజుకొకసారి చొప్పున నాలుగు రోజులపాటు తాగాలి. చప్పటి పథ్యం (ఉప్పు, కారం లేని భోజనం) తీసుకోవాలి. ఈ వ్యాధికి పథ్యం చాలా నిష్ట చేయటం చాలా ముఖ్యం.

**✷ తలనొప్పికి :**

ఎల్లప్పుడూ తలనొప్పితో బాధపడే వారు దాని నివారణకు ఇలా చేస్తే ఉపశమనం కలిగే అవకాశాలు చాలా ఎక్కువ. ఒకరోజు తల స్నానం చేయాలి, రెండవ రోజు ఉదయం 11 గంటలకు భోజనం చేసి "త్రిశూల దొండ" ఆకు 50 గ్రా. తీసుకుని బాగా నలిపి తలపై (మాడుపైన) రసాన్ని పోయాలి. తెల్ల గుడ్డను మెడనుండి తలపైకి గట్టిగా కట్టు కట్టుకుని నిద్రపోయి లేస్తే తలనొప్పి తగ్గిపోతుంది.

**✷ పశువుల వైద్యానికి చిట్కాలు :**

పశువుల కళ్ళకు పుసులు వచ్చి నీరు కారుతున్న పుడు వాటి కళ్ళవెంట కారే నీరు చూస్తే అవి ఎంత బాధపడుతున్నాయో వర్ణించలేము. అలాంటి వ్యాధి నివారణకు రెండు కుంకుడు కాయలతో అరగదీసిన గంధాన్ని, రెండు మిరియాలను పొడిగా చేసి అందులో కలిపి పశువు కళ్ళకు కాటుకలా రాయాలి. ఇలా చేస్తే రెండు రోజుల్లో పశువుకు ఉపశమనం కలుగుతుంది.

**✷ దూడలకు గోమారి/పిరుదులు/పేల నివాణకు :**

దూడలో గోమారి, పిరుదులు, పేలు వ్యాప్తి చెందడం వల్ల దూడపిల్లల ఎదుగుదల తగ్గిపోతుంది. అవి దూడ రక్తాన్ని పీలుస్తాయి కాబట్టి దూడలు బక్కచిక్కిపోతాయి. వాటి నివారణకు మజ్జిగలో వస పొడిని కలిపి దూడ శరీరానికి పూయాలి. ఇది పూసే ముందు దూడని శుభ్రంగా సబ్బుతో కడగాలి. రెండు మూడు రోజులకోసారి ఇలా చేస్తే దూడలకు పట్టిన గోమారి, పిరుదులు, పేలు నశించి పోతాయి.

**✷ దూడలలో ఏలికపాములు (వార్మ్స్) పడుతున్నపుడు :**

గోంగూర ఆకును ఉడికించి, దాని కషాయాన్ని వారానికి ఒకసారి త్రాగించాలి. రెండుసార్లు అలా తాగిస్తే ఏలికపాములు తగ్గుముఖం పడ్తాయి. కషాయం పోసిన నాడు దూడకు తల్లి పాలు ఎక్కువ విడవాలి.

ఈ సాంప్రదాయ జ్ఞానం మూలికా వైద్యులు అందించినవి. వీటిని శాస్త్రీయంగా పరీక్షించలేదు. కావున వీటిని ఉపయోగించుకునే ముందు మూలికా వైద్యునితో చర్చించండి ఫలితాలకు పాఠకులే బాధ్యులు. 'పల్లెసృజన' ఎటువంటి బాధ్యత వహించదు. - ఎడిటర్

విద్యార్థులలో ఉండాల్సిన ముఖ్య లక్షణం ప్రశ్నించటం. వాళ్ళకా అవకాశమివ్వండి.

## విఫణి వీధిలో అడుగుపెట్టిన పల్లెజ్ఞానం

# చంద్రశేఖర్ శ్రీతైలం




శ్రీతైలం నాడు - నేడు

చిత్తూరు జిల్లా తొట్టంబేడు మండలం, కారాకొల్లు గ్రామానికి చెందిన జి. చంద్రశేఖర్, బత్తినాయుడు, చిరంజీవులు నాయుడు, మురళి, వెంకటేశ్వర్లు, భాస్కర్, శివలతో కూడిన 7 మంది మిత్ర బృందానికి నాయకుడు చంద్రశేఖర్. వీరు 1994 నుండి మొక్కలపై పరిశోధనలు చేస్తున్నారు. అప్పటి కొన్ని పత్రికలలో వీరి పరిశోధనలను గురించిన వార్తలు కూడా ప్రచురించబడ్డాయి. కానీ, 2007లో ఈనాడు పత్రికలో 'నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్' గురించి, దాని అనుబంధ సంస్థ అయిన పల్లెసృజన అధ్యక్షులు బ్రిగేడియర్ గణేశం గారిని గురించి చూడటం జరిగింది. మొక్కలపై తాము చేస్తున్న ప్రయోగాలను వివరిస్తూ గణేశం గారికి ఉత్తరం వ్రాయగా, వారు కారాకొల్లు గ్రామాన్ని సందర్శించారు. చంద్రశేఖర్ బృందం చేస్తున్న ప్రయోగాలను మెచ్చుకున్న గణేశం గారు తమ 'పల్లెసృజన' పత్రికలో ప్రచురించారు. ఆ తర్వాత ప్రఖ్యాత వ్యవసాయ పరిశోధనా సంస్థ 'నారమ్'కు వీరిని తీసుకువెళ్ళి వీరి ప్రయోగాలను శాస్త్రవేత్తల ఎదుట ప్రదర్శింపజేశారు. అలా నారమ్ డైరెక్టర్ అయిన కల్పనా శాస్త్రిగారి దృష్టిలో పడ్డారు చంద్రశేఖర్ బృందం. వారు ప్రచురించిన 'రూరల్ ఇన్నోవేషన్స్' (గ్రాస్ రూట్స్) అనే పుస్తకంలో వీరిని గురించి, వీరి ప్రయోగాలను గురించి ప్రచురించారు. అలా యావత్ దేశానికి వీరి ప్రయోగాలను గురించి తెలిసింది.

చంద్రశేఖర్ బృందం తమ చుట్టూ వున్న అడవుల్లో లభించే ఒక మొక్క దోమ లార్వాలను, నులి పురుగుల (నిమటోడ్స్)ను చంపుతుందని తమకు తెలిసిన పరిజ్ఞానాన్ని బ్రిగేడియర్ గారికి చెప్పడం, వారు దానిని ఢిల్లీకి తీసుకువెళ్ళి నిమటోడ్స్‌కు సంబంధించిన శాస్త్రవేత్తల దృష్టికి తీసుకు వెళ్ళి వారితో పరిశోధనలు చేయించడం జరిగింది. ఆ పరిశోధనా ఫలితాల ఆధారంగా 2013 లో వీరి ఇన్నోవేషన్‌ను రాష్ట్రపతి అవార్డుకు ఎంపిక చేయటం, ఆ తర్వాత రాష్ట్రపతి పురస్కారం పొందడం జరిగింది. పల్లెల్లో జరిగిన ప్రయోగాలు ఢిల్లీకి చేరాయంటే గణేశం గారు, వారి ఆధ్వర్యంలో నడుస్తున్న 'పల్లెసృజన' వల్లనే సాధ్యమైంది అంటారు చంద్రశేఖర్.

అలాగే వారు కనిపెట్టిన "శ్రీతైలం" అనే ఆయుర్వేద పైపూత మందు నొప్పుల నివారణిగా, గాయలను త్వరలో నయం చేసేదిగా, దోమల బెడదను తప్పించేదిగా ఉందని తెలుసుకున్న గణేశం గారు శ్రీతైలంను ప్రఖ్యాత పరిశోధనా సంస్థ సిసిఎంబి దృష్టికి తీసుకు వెళ్ళడం, వారు దానిపై ఆసక్తిని ప్రదర్శించి ఎం.ఓ.యు. చేసుకోవడం, తదుపరి ప్రయోగాలు చేయడం జరిగింది. సిసిఎంబి డైరెక్టరు



7వ జాతీయ ద్వైవార్షి పోటీల్లో పురస్కారం స్వీకరిస్తున్న చంద్రశేఖర్

**ఒక దేశం అవినీతి లేకుండా అందమైన ఆలోచనలు కల మేధస్సుతో నిండి ఉండాలంటే నా గట్టి నమ్మకం అది ముగ్గురే చెయ్యగలరు. ఒకరు అమ్మ, రెండు నాన్న, మూడు గురువు.**



శ్రీతైలం తయారు చేసిన చంద్రశేఖర్ బృందం



శ్రీతైలం మార్కెట్‌లోకి విడుదల చేస్తున్న దృశ్యం

కారాకొల్లు గ్రామాన్ని సందర్శించి, వీరి ప్రయోగాలను ప్రత్యక్షంగా చూడటం వారి జీవితంలోని మరపురాని సంఘటనల్లో ఒకటి.

"ఒక్కమాటలో చెప్పాలంటే 'నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్', హనీబీ ఎపి కో-ఆర్డినేటర్, 'పల్లెసృజన' అధ్యక్షులు అయిన గణేశం గారు పరిచయం కాకముందు అతి తక్కువ మంది మా ప్రయోగాలను గుర్తించేవారు. ఇప్పుడు పెద్దపెద్ద శాస్త్రవేత్తలు కూడా మా ప్రయోగాలను గుర్తించి అభినందిస్తున్నారు" అంటారు చంద్రశేఖర్ ఆనందంతో.

"ఇన్నోవేటర్లను గురించి శాస్త్రవేత్తల కంటే గణేశం గారు పడే తపన మరువలేనిదని, విజ్ఞాన శాస్త్రం + మానవతా వాదం కలిసి మూర్తీభవించిన గణేశం గారు మాలో నింపిన స్ఫూర్తి వల్లనే మాకు ఇంతటి పేరు ప్రఖ్యాతులు వచ్చాయనీ, తమ జీవన గమనమే మారిపోయేలా చేశాయని, పల్లెసృజన సంపాదకవర్గానికి సదా కృతజ్ఞులం" అంటారు చంద్రశేఖర్ గారు.

చంద్రశేఖర్ రూపొందించిన 'శ్రీతైలం' ఇప్పుడు ఒక పేరున్న ఆయుర్వేద సంస్థతో జరిగిన ఒప్పందం వల్ల ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని మార్కెట్లో లభ్యమౌతోంది. తమిళనాడు, కర్ణాటక రాష్ట్రలలో కూడా విస్తరింప జేయటానికి కృషి జరుగుతోంది. ఈ ఒప్పందం వల్ల చంద్రశేఖర్ బృందం పడ్డ కృషి సమాజానికి లాభం చేసి తద్వారా వారు ఆర్థికంగా వృద్ధిలోకి వస్తారని పల్లెసృజన మనసారా ఆశిస్తున్నది. ప్రస్తుతం శ్రీతైలం తయారీలో ఆనందంగా పాలు పంచుకుంటోంది.

**శ్రీతైలం మరియు నిమటోడ్స్ మందులు కావలసిన వారు ఈ క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించ గలరు.**

**చంద్రశేఖర్ : 98495 41674, సుభాష్ :96528 01700**



శ్రీతైలం తయారీకి ఎన్.ఐ.ఎఫ్. అందించిన సహాయం

**తెలుగు రాష్ట్రాలకు చెందిన ఇన్నోవేటర్లు తయారు చేసిన ఇన్నోవేషన్లు, 'పల్లెసృజన' చేస్తున్న కార్యక్రమాలను గురించి వివరంగా తెలుసుకునేందుకు www.pallesrujana.org వెబ్‌సైట్‌ను సందర్శించగలరు.**


ఒక్కొక్కప్పుడు బడి మానేసి స్నేహితులతో షికారుకెళ్ళడమే మంచిదేమో. ఎందుకంటే ఎదిగాక అనిపిస్తుంది.... నాకొచ్చిన మార్కులలో ఆనందం లేదు, కానీ నా జ్ఞాపకాలలో ఆనందం ఉంది అని.

# అమేజింగ్ ఇండియన్ ప్రధాన మంత్రి గౌరవించిన చింతకింది మల్లేశం




'టైమ్స్ నౌ' అమేజింగ్ ఇండియన్స్ పురస్కారాలను 14 జనవరి, 2016న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అందజేశారు. దేశంలో విశిష్టమైన వ్యక్తులకు అందించే 'అమేజింగ్ ఇండియన్స్' పురస్కారం 'పల్లెసృజన' వెలుగులోకి తెచ్చిన మన తెలుగు ఇన్నోవేటర్, ఆసు యంత్రం సృష్టికర్త 'చింతకింది మల్లేశం'ను వరించింది.

ఈ సందర్భంగా అవార్డుల ప్రదానోత్సవం తర్వాత ప్రధాని మోదీ సభికులను ఉద్దేశించి ప్రసంగిస్తూ సాధారణ వ్యక్తులు కూడా చరిత్రను మార్చగలరు అని స్పష్టం చేశారు. తగిన పరిస్థితులు వుంటే గొప్ప పనులు చేయడం సాధ్యమే నని చాలామంది భావిస్తారు. కానీ, తీవ్ర ఆకాంక్ష ఉన్నవారు ఎన్ని కష్టాలనైనా ఎదుర్కొని పని చేయడం ద్వారానే గొప్ప లక్ష్యాలను సాధిస్తారని అన్నారాయన. జీవితంలో ఏదో ఒకటి చేయాలని తపించే వారే కష్టాలను, సవాళ్ళను అధిగమించ గలరు అని ఉద్బోధించారు. 'చిన్న స్థాయి ప్రజలు కూడా చరిత్రను మార్చగలరు అని ప్రజలు అర్థం చేసుకోవాలి, వారి కృషిని మరచిపోరాదు అని సూచించారు.



గురువారం ఢిల్లీలో 'టైమ్స్ నౌ అమేజింగ్ ఇండియన్స్' అవార్డుల ప్రదానోత్సవంలో ప్రసంగిస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ

ఈ పురస్కారాన్ని స్వీకరించేందుకు చింతకింది మల్లేశం తన తల్లి, భార్యతో సహా ఢిల్లీకి వెళ్ళి అక్కడ జరిగిన భారీ కార్యక్రమంలో ప్రధాని చేతుల మీదుగా పురస్కారాన్ని స్వీకరించారు. ఇంతటి గొప్ప పురస్కారం అందుకున్నప్పుడు మీ అనుభూతి ఏమిటని మల్లేశం తల్లి లక్ష్మిని, అతని భార్య సువర్ణలను అడగగా, ఆనందంతో వారి కండ్లలో నీళ్ళు సుడులు తిరిగాయి. మల్లేశం తల్లి లక్ష్మి మాట్లాడుతూ 'ఒక గ్రామంలో కులవృత్తి చేసుకుంటూ పొట్టపోసుకుంటున్న మమ్ములను ఇంతటి స్థాయికి చేర్చిన 'పల్లెసృజన' మేలు ఎన్నటికీ మరువలేమన్నారు.

ఢిల్లీనుండి హైదరాబాద్ ఎయిర్ పోర్టులో దిగిన మల్లేశం తన భార్య, తల్లితో పాటు తన ఆనందాన్ని పంచుకోవటానికి నేరుగా సికింద్రాబాద్‌లో వున్న 'పల్లెసృజన' కార్యాలయానికి వచ్చారు. మల్లేశం ప్రతిస్పందన తెలియజేయటానికి, విలేకరుల సమావేశాన్ని నిర్వహించడ మైనది. 'పల్లెసృజన' అధ్యక్షులు బ్రిగేడియర్ పోగుల గణేశం, ఉపాధ్యక్షులు జె. శ్రీకర్, జె. దుర్గాప్రసాద్, ఉప కార్యదర్శి పల్లె వీరరాఘవ రెడ్డి, క్రియేటివ్ మైండ్స్ ఇన్‌ఛార్జి బి. సుభాష్ మరియు ఇతర కార్యాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించి పత్రికా విలేకరులకు ఈ వార్తను అందజేయటం జరిగింది.

ఈ సందర్భంగా పల్లెసృజన అధ్యక్షులు బ్రిగేడియర్ పోగుల గణేశం మాట్లాడుతూ 'చింతకింది మల్లేశం ఎంతో ఉన్నతమైన పురస్కారాన్ని గ్రహించడం మాకు ఆనందంగా వుందని, మల్లేశంకు గతంలోనే ప్రతిష్ఠాత్మకమైన రాష్ట్రపతి పురస్కారం దక్కిందని అన్నారు. అతని జీవితంలో ఎన్నో మరపురాని సంఘటనలు చోటు చేసుకున్నాయి. మాజీ

**ప్రేమించటానికి ఈ జీవితకాలం సరిపోదు. మరి ద్వేషించటానికి మనుషులకి సమయం ఎక్కడ్నించి వస్తుందో?**



...రస్కారాన్ని ప్రధాని చేతులమీదుగా స్వీకరిస్తున్న మల్లేశం

రాష్ట్రపతి అబ్దుల్ కలాం గారితో ప్రత్యక్షంగా కూర్చుని అల్పాహార విందు స్వీకరించడం, హాల్ ఆఫ్ ఫేమ్‌లో పేరు నమోదు చేసుకోవటం లాంటివి మచ్చుకు కొన్ని... అన్నారాయన. మల్లేశం ఎప్పుడూ తన తోటి చేనేత కార్మికుల అవస్థలను, వారికి ఉపశమనం కలిగించేందుకు, ఆర్థికంగా ఇబ్బంది కలగకుండా చేయటానికి ఎల్లప్పుడూ కృషి చేస్తూనే వున్నాడని' కొనియాడారు.

మల్లేశం ప్రధాని చేతుల మీదుగా 'అమేజింగ్ ఇండియన్' పురస్కారం గైకొన్నందుకు పల్లెసృజన కార్యాలయ సిబ్బంది మొత్తం ఎంతో ఆనందంతో తమ అభినందనలు తెలియజేశారు.

పురస్కార గ్రహీత చింతకింది మల్లేశం మాట్లాడుతూ "ఒక మామూలు చేనేత కార్మికుడైన నన్ను నా తల్లి కష్టాన్ని, మా తోటి నేత కార్మికుల కష్టాలను కొంతవరకైనా తగ్గించాలని తయారు చేసిన 'ఆసు యంత్రం' ను వెలుగులోకి తెచ్చిన 'పల్లెసృజన'ను నా జీవితంలో మరచిపోలేను. నేను ప్రపంచ స్థాయిలో పేరు ప్రఖ్యాతులను సాధించేలా చేసి, నా ఇన్నోవేషన్ ద్వారా ఆర్థికంగా కూడా అభివృద్ధి అయ్యేలా తోడ్పడిన పల్లెసృజన వారి నిస్వార్థ సేవలను గురించి మాట్లాడటానికి మాటలు రావటం లేదని" తన ఆనందాన్ని వ్యక్తం చేశాడు.

మన తెలుగు ఇన్నోవేటర్ చింతకింది మల్లేశంను ప్రధాన మంత్రి ద్వారా "ఇక్రెడిబుల్ ఇన్నోవేటర్" అవార్డును దేశ స్థాయిలో అందుకున్నందుకు పల్లెసృజనకు ఎంతో ఆనందం కలిగింది. వాలంటీర్ల స్వచ్ఛంద శ్రమయే ఇలాంటి సత్కారాలు ఇన్నోవేటర్లకు రావటానికి కారణం. ఇలాగే ఎంతోమంది మన తెలుగు ఇన్నోవేటర్లకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు రావటానికి 'పల్లెసృజన' వాలంటీర్ల బృందం ఎల్లప్పుడూ కృషి చేస్తూనే వుంటుంది. ●


'పల్లెసృజన' సిబ్బందితో చింతకింది మల్లేశం, అతని భార్య సువర్ణ, తల్లి లక్ష్మి

**చేతకాదని ఎప్పుడూ చేతులెత్తేయకూడదు. సమస్యలు మనల్ని ఓడించనీయకూడదు.**




# 'పల్లెసృజన' ప్రగతి

**మీతో పంచుకుని ఆనందించేందుకు కొన్ని విశేషాలు....**

2014-15 సంవత్సరంలో 'పల్లెసృజన' స్వచ్ఛంద కార్యకర్తలు అందించిన సహకారంతో ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని 'పునాది స్థాయి సృజన'లను మీకందించే క్రమంలో జరిగిన కొన్ని ముఖ్య ఘట్టాలను మీతో పంచుకోవటం మాకు ఆనందం కలిగించే విషయం. ఈ ఘట్టాలు సమాజానికి కొంత సమాచారం అందించటంతో పాటు పునాది స్థాయి ఇన్నోవేటర్లకు కొంత ప్రోత్సాహకరంగా వుంటుందని ఆశిస్తున్నాం. ఇక్కడ వివరిస్తున్న సంఘటనలన్నీ పూర్తిగా 'పల్లెసృజన' వాలంటీర్ల విజయాలుగానే మేము భావిస్తున్నాము.

**పునాది స్థాయి సృజనాత్మక ఇన్నోవేషన్ల అంతర్జాతీయ సదస్సు :**

✤ పల్లెసృజనకి ఒక ఇన్నోవేటర్‌తో సహా అహమ్మదాబాద్‌లో జనవరి 2015 ఆఖరి వారంలో జరిగిన పునాది స్థాయి ఇన్నోవేషన్ల సృజనాత్మకతను గూర్చిన అంతర్జాతీయ సదస్సులో పాల్గొనే అదృష్టం దక్కింది. 39 దేశాలు పాల్గొన్న ఈ సదస్సులో భిన్న దేశాల నుండి వచ్చిన సభ్యుల విజ్ఞత యొక్క మేలి కలయిక అపూర్వం. ఎటువంటి వ్యాపారము లేదు కేవలం ప్రపంచ శ్రేయస్సే ధ్యేయంగా సమావేశాలు జరిగాయి. మల్లేశం ఆసు యంత్రం ఎంతోమంది అంతర్జాతీయ సభ్యుల మెప్పు పొందింది.

**ఇగ్నైట్ పురస్కారం :**

✤ మన మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఎపిజె అబ్దుల్ కలాం వద్దనుండి ఐఐఎం అహమ్మదాబాద్‌లో హైదరాబాద్, నెల్లూరుకి చెందిన ఇద్దరు బాలలు ఇగ్నైట్ పురస్కారాలు స్వీకరించారు.

**శ్రీలంకనుండి :**

✤ నారమ్, హైదరాబాద్ సౌజన్యంతో 24 మంది వ్యవసాయ శాస్త్రవేత్తలు పల్లెసృజన కార్యాలయంలో ఏర్పాటు చేసిన 'ఇన్నోవేషన్ల వితరణ కేంద్రం' ఒకరోజు సందర్శనకి రావటం జరిగింది.

**ఎ.ఎస్.సి.ఐ. నుండి అధికారులు, శాస్త్రవేత్తలు :**

✤ అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా, హైదరాబాద్ వారు అధికారులను, శాస్త్రజ్ఞులను, ప్రభుత్వ ఉద్యోగులను పల్లెసృజన కార్యాలయానికి 'ఇన్నోవేషన్ల వితర కేంద్రం' సందర్శనకు పంపుతోంది. ఈ బృందం కార్యాలయాన్ని సందర్శించిన తర్వాత ఇన్నోవేటర్లని, వారి వారి పరిజ్ఞానాన్ని నిశితంగా పరీక్షించడానికి దగ్గరలో వున్న పల్లెలకి వెళ్ళి అట్టడుగు ప్రాంతాల్లో చేసే కార్యక్రమాలను పర్యవేక్షిస్తారు. పల్లెసృజన కార్యక్రమాలకి 250 మందికి పైగా సభ్యులు హాజరైనారు. ఈ కార్యక్రమాలు తరచు చేస్తున్నందుకు ఆ కళాశాల అభినందనలు తెలియజేసింది.

**ఎంఐటి ఫ్యాబ్ ల్యాబ్‌లో 'ప్రజా సృజనాత్మక స్థలి'గా చేరిన 'పల్లెసృజన' :**

✤ పల్లెసృజన కార్యక్రమాలు అంతర్జాతీయంగా పేరు పొందటం ముదావహం. అమెరికాలోని ఎంఐటి ఫ్యాబ్ ప్రయోగశాల తమ అంతర్జాతీయ పట్టికలో 'పల్లెసృజన'ను "ప్రజా సృజనాత్మక స్థలి'గా చేర్చారు.

**ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఆపిల్ చెట్ల పెంపకానికి మొక్కల వితరణ :**

✤ పల్లెసృజన ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని వేర్వేరు ప్రాంతాల్లో దాదాపు 10 మందికి ఆపిల్ పండ్ల మొక్కల వితరణ చేయటం జరిగింది. వీటి పెరుగుదలని పల్లెసృజన నిశితంగా గమనిస్తోంది. ఇవి సక్రమంగా బ్రతికితే మూడవయేడు కాపుకు వస్తాయి.

**'పల్లెసృజన' పత్రిక :**

✤ 2006లో ప్రారంభించబడిన 'పల్లెసృజన' పత్రిక ఒక దశాబ్దం పూర్తి చేసుకోబోతున్నది. మొదట్లో త్రైమాసిక పత్రికగా వున్న ఈ పత్రిక ఇప్పుడు ద్వైమాసిక పత్రికగా ప్రతి రెండు నెలలకు ఒకసారి నిరంతరాయంగా వెలువడుతోంది. ఈ పత్రిక రైతులు, ఇన్నోవేటర్లకి సంధానకర్తగా పనిచేస్తున్నది.

**ప్రపంచ మహిళా ఫోరమ్ సభ్యుల రాక :**

✤ ఆఫ్రికా, లాటిన్ అమెరికా, అమెరికా సంయుక్త రాష్ట్రాలు, ఐరోపా నుండి వచ్చిన 24 మంది ప్రపంచ మహిళా ఫోరమ్ సభ్యులతో నల్గొండ జిల్లా బచ్చన్నపేట గ్రామంలోని చేనేత కుటుంబాల మహిళలతో సమన్వయం.

**మా కలలు నిజం కావాలంటే మీ సహకారం కావాలి.**
**ప్రోత్సహించండి - పాల్గొనండి - ఆవిష్కరించండి.**

- **బ్రిగేడియర్ పి. గణేశం,** అధ్యక్షులు,
పల్లెసృజన సంఘం.

**లక్ష్యం లేకపోవటం కన్నా పెద్ద నేరం ఏదీ ఉండదు.**

మహారాజశ్రీ బ్రిగేడియర్ పోగుల గణేశం గారికి,

హనీబీ, పల్లెసృజన నిర్వహిస్తున్న మీగురించి ఎంత చెప్పినా తక్కువే అనిపిస్తుంది. తెలుగు రాష్ట్రాల్లోని 23 జిల్లాల్లో వున్న ఇన్నోవేటర్లను వెతికి, వెలికి తీసి, వారికి పేటెంట్‌లు ఇప్పించడంలో, వాటిని తయారు చేసి మార్కెటింగ్ చేయించటంలోకాని, ఆర్థికంగా ప్రోత్సహించడంలో గాని, పల్లెసృజన పత్రికలో ముద్రించడం గాని, ఎన్.ఐ.ఎఫ్. ద్వారా అవార్డులు ఇప్పించడంగా, రాష్ట్రపతి అవార్డులు ఇప్పించటంలో....... ఒక పల్లెటూరు ఇన్నోవేటర్ రాష్ట్రపతి భవనంలోకి వెళ్ళడం సాధ్యమా?!!! కానీ, మీరు దీన్ని సాధ్యం చేసి చూపిస్తున్నారు.!

ఎన్నో పాఠశాలలు, కళాశాలల్లో ఇన్నోవేటర్లను గురించి చెప్పటం ఎంతో కృషి, పట్టుదలతో మీరు పని చేస్తున్నారు. చిన్నశోధయాత్రలలో కళాశాల విద్యార్థుల నుంచి ఏ వయసు వారైనా పాల్గొనవచ్చు, అటువంటి చిన్న శోధయాత్రలలో పట్టణాల్లో ఏయే సౌకర్యాలున్నాయి, పల్లెటర్లలో ఏ సౌకర్యాలున్నాయి, మన జీవనాధారం ఏంటి, గ్రామీణుల జీవనాధారం ఏమిటి, పట్టణాల్లోని వ్యక్తుల అలవాట్లు, పల్లెటూరి వారి అలవాట్లు, ఏ మొక్కలో ఏ ఔషధం ఉందో మీరు అవలీలగా చెప్పగలరు.

రైతుల గురించి ఎంతో ఆర్ధతతో ఉంటారు. సేంద్రియ క్రిమి సంహారక మందులు వాడాలని, తక్కువ ఖర్చుతో వ్యవసాయం చేయాలని, పండించే ఉత్పత్తులు క్రిమి సంహారక మందులు వాడకుండా, ఆరోగ్యకరమైన పంటలు పండించాలని మీరు ఎంతగానో చేస్తున్న కృషి అమోఘం. **– కొల్లి నాగ శ్రీనివాస్,** ఫోన్ : 9948662652

కొల్లి నాగశ్రీనివాస్ గారూ,

కృతజ్ఞతలు. మీరు ఇన్నోవేటర్లే కాకుండా పల్లెసృజన ఉద్యమాన్ని ముందుకు తీసుకు వెళ్ళటానికి ఉత్సాహంగా పని చేస్తున్నారు. పల్లెసృజన ఉద్దేశ్యాలను, పల్లె జ్ఞానాన్ని సేకరించి, పల్లెల్లో పంచి సమాజానికి లాభం చేయాలన్న ఉద్దేశ్యాన్ని మీరు పూర్తిగా అర్థం చేసుకుని, దాన్ని పదిమందికీ చెప్పడానికి ప్రయత్నిస్తున్నందుకు మా కృతజ్ఞతలు. **– ఎడిటర్**

## FORM IV

### PALLESRUJANA R.N.I. No. APTEL 12136/01/1/2011-TC

| | | |
|---|---|---|
| 1. Place of publication | : | Ranga Reddy Dist |
| 2. Periodicity of its publication | : | Bi-Monthly |
| 3. Printer's Name | : | Narendra Grafix |
| Nationality | : | Indian |
| Address | : | 1-1-336/53, Vivek Nagar, Chikkadpally, Hyderabad - 500 020. |
| 4. Publisher's Name | : | P. Ganesham |
| Nationality | : | Indian |
| Address | : | P.No.102, Vayupuri, Sainikpuri Post, Malkajgiri Mandal, Ranga Reddy Dist. A.P. |
| 5. Editor's Name | : | P. Ganesham |
| Nationality | : | Indian |
| Address | : | 102, Vayupuri, Sainikpuri Post, Secunderabad. |
| 6. Names and addresses of individuals who own the newspaper and partners or shareholders holding More than one per cent of the total capital. | : | N.A. |

I, P. GANESHAM, hereby declare that the particulars given above are true to the best of my knowledge and belief.

Date 28-4-2011

Signature of Publisher

ఒక మంచి పుస్తకం వందమంది స్నేహితులతో సమానం. కానీ ఒక మంచి స్నేహితుడు ఒక గ్రంథాలయంతో సమానం.

# రైతులకోసం రైతులు కనిపెట్టిన సేంద్రియ క్రిమి సంహారక మందులు

## తులసి




పంటల ఎదుగుదలకు,
వైరస్ నివారణకు
సేంద్రియ మందు

## పర్‌ఫెక్ట్




వరిలో సుడిదోమ
పత్తి, మిరప, ఇతర కూరగాయ
పంటలను ఆశించే రసం పీల్చే పురుగు,
తెల్లదోమ, పచ్చదోమ, పిండినల్లి
మొదలైన వాటిని
సమర్థవంతంగా నివారిస్తుంది

## సృష్టి కృషక్




పంటల
ఎదుగుదలకు,
ఆకుముడత తెగులు
నివారణకు
సేంద్రియ మందు

## సృష్టి సుదర్శన్




పంటల
ఎదుగుదలకు,
కూరగాయల పంటలలో
పురుగుల నివారణకు
సేంద్రియ మందు

## సృష్టి సర్వత్ర




పంటల ఎదుగుదలకు,
రసం పీల్చే పురుగు
నివారణకు
సేంద్రియ మందు

## సృష్టి ప్రహార్




పంటల ఎదుగుదలకు,
పిండినల్లి
నివారణకు
సేంద్రియ మందు

## సృష్టి ప్రయాస్




పంటల ఎదుగుదలకు,
పూత రాలుట
నివారణకు
సేంద్రియ మందు

## సృష్టి శక్తి




పంటల ఎదుగుదలకు
సేంద్రియ మందు

## సృష్టి శస్త్ర




పంటల ఎదుగుదలకు,
తామర పురుగు, తెల్లదోమ,
శనగపచ్చ పురుగుల
నివారణకు సేంద్రియ మందు

## సృష్టి కె&సి




పంటల ఎదుగుదలకు,
బ్యాక్టీరియా, ఫంగస్
నివారణకు
సేంద్రియ మందు

## సృష్టి సురక్ష



పంటల ఎదుగుదలకు,
చెదల నివారణకు
సేంద్రియ మందు

## సృష్టి రక్షక్




పంటల ఎదుగుదలకు,
పత్తి పంటలో
పురుగుల నివారణకు
సేంద్రియ మందు

---

పశువుల ఆరోగ్యం 'బోయ పెద్దరాజన్న' వైద్యం

**'కుందా' వ్యాధి మందు**

(నరాల బలహీనతతో కాళ్ళు చచ్చుపడిపోవడం)



2 వెల్లిపాయలు, 20 మిరియాలు పొడిలో కలిపి నూరి వేడినీటిలో కలిపి ఒకరోజు ఉదయం మరియు సాయంత్రం పశువుకు త్రాగించాలి.
ఈ ప్యాకెట్‌లోని మందు ఒకరోజు పశువుకు త్రాగించడానికి ఉపయోగ పడుతుంది.
మీ అభిప్రాయాలను మాకు తెలపండి

**క్రియేటివ్ మైండ్స్**

ఫోన్ : 040-27111959
ఇ-మెయిల్ : creativemindsap@gmail.com

పశువైద్యంలో పేరెన్నికగన్న
అనంతపురం జిల్లా వాసి
బోయ పెద్దరాజన్న
తయారు చేసిన
పశువుల మందులు

పశువుల ఆరోగ్యం 'బోయ పెద్దరాజన్న' వైద్యం

**'పొదుగువాపు' వ్యాధి మందు**



ప్యాకెట్‌లోని సగం పొడిని
వేడినీటిలో కలిపి
వాచిన పొదుగుకు పట్టించాలి.
రెండురోజులు వరుసగా
పొదుగుకు పట్టించినచో
పొదుగు మామూలుగా మారి
పాలు పితకడానికి వీలవుతుంది.
మీ అభిప్రాయాలను మాకు తెలపండి

**క్రియేటివ్ మైండ్స్**

ఫోన్ : 040-ఫోన్ : 040-27111959
ఇ-మెయిల్ : creativemindsap@gmail.com

---

కావలసిన వారు సంప్రదించవలసిన చిరునామా :

**క్రియేటివ్ మైండ్స్**, ఇంటి నెం. 67, వాయుపురి, సైనిక్‌పురి పోస్ట్, సికింద్రాబాద్ - 500094.
ఫోన్ : 040-27111959, మొబైల్ : 96528 01700

PALLESRUJANA Telugu Bi-monthly 20/- Jan-Feb- 2016 RNI No. APTEL 12136/01/01/2011-TC

# పల్లెసృజన

## పాత సంచికలు కావాలా?

ఒక్కో సంచిక రూ. 30/-లు మాత్రమే




**చందా వివరాలు**

| వివరములు | వ్యక్తిగతం | సంస్థ/లైబ్రరీ |
|---|---|---|
| సంవత్సరానికి | 200/- | 800/- |
| రెండు సంవత్సరాలకి (ఒక పాత సంచిక ఉచితం) | 350/- | 1,400/- |
| మూడు సంవత్సరాలకి (రెండు పాత సంచికలు ఉచితం) | 500/- | 2,000/- |
| ఐదు సంవత్సరాలకి (నాలుగు పాత సంచికలు ఉచితం) | 800/- | 3,200/- |

పల్లెసృజన చందాదారులు కండి, పల్లె జ్ఞానాన్ని వ్యాపింపజేయండి. చందాదారులుగా చేరాలనుకున్నవారు ఈ క్రింది చిరునామాకు మీ యం.ఓ.లు పంపండి. మీ చిరునామా స్పష్టంగా వ్రాయటం మరవకండి.

పల్లెసృజన, 102, వాయుపురి, సైనిక్‌పురి పోస్ట్,
సికింద్రాబాద్ - 500 094. ఫోన్ : 040-27111959, సెల్ : 9866 00 1678
E-mail : anchor@pallesrujana.org Visit us : www.pallesrujana.org

లేదా నేరుగా ఈ బ్యాంక్ అకౌంట్‌లో జమ చేయండి.
మీ చిరునామాను స్పష్టంగా మాకు వ్రాసి పంపండి లేదా యస్.యం.యస్. లేదా ఇ-మెయిల్ చేయండి.

**M/s Pallesrujana, Syndicate Bank, Sainikpuri, Secunderabad.**
**SB A/c No. 30232200019150, IFS Code : SYNB0003023**

Narendra Grafix, Hyd. Ph.: 81257 99904